J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS





# లాయర్

సంపుటి : 45 సంచిక : 26 28.11.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# లోకేష్ ముఖ్యమంత్రిగా కొత్త క్యాబినెట్!

## చినబాబుకి పెద్ద బాధ్యత

- 2027 ఉగాదికి ముహూర్తం
- రంగం సిద్ధం చేస్తున్న చంద్రబాబు
- యువ సారధ్యానికి ఓకే చెప్పిన బీజేపీ



**ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో 2027 పెను మార్పుకి నాంది పలకబోతోందని జోస్యం చెప్తున్నారు రాజకీయ విశ్లేషకులు. చారిత్రాత్మక తెలుగుదేశం పార్టీ సారధ్య బాధ్యతలతో పాటు ప్రభుత్వ పాలనా పగ్గాలని కూడా మూడవతరం నాయకుడు నారా లోకేష్ చేపట్టబోతున్నాడన్న చర్చ ఇప్పుడు రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది. ఆ దిశగా చంద్రబాబునాయుడు పావులు కదుపుతున్నారన్న మాట సర్వత్రా వినపడుతోంది.**

ఆహార్యంలో మార్పు, ఆలోచనల్లో మార్పు, మాటతీరులో మార్పు, హావభావాల్లో మార్పు... ఇలా తనను తాను మార్చుకుంటూ, రాజకీయ జీవితాన్ని మలుచుకుంటూ, ఇంతింతై వటుడింతై అన్నట్లుగా దూసుకెళ్తున్నారు తెలుగుదేశం యువతేజం నారా లోకేష్. పట్టుబట్టి మంగళగిరిలో నిలిచి గెలిచినా, కార్యకర్తలకు అండగా తానున్నానంటూ భరోసా ఇచ్చినా, లోకేష్ స్టయిలే వేరన్నట్లుగా దూసుకుపోతున్నాడు. రాజకీయాల్లో పెద్ద మర్రిచెట్టు వంటి చంద్రబాబు నాయుడు చెంతన వుంటూ, ఆయన నీడలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించడం అంత ఆషామాషీ విషయం కాదు. కానీ, లోకేష్ మాత్రం చంద్రబాబు ప్రాభవం నుంచి బయటకొచ్చి తనను తాను నిరూపించుకుని తన ప్రస్థానాన్ని ఘనంగా ముందుకు తీసుకెళ్తున్నారనడంలో సందేహం లేదు.

లోకేష్‌లోని ఈ ప్రతిభే ప్రధాని మోడీని కూడా ఆకర్షించిందని, అతడి పట్టుదల, దూరదృష్టి, సమయస్ఫూర్తిని గుర్తించే భవిష్యత్ నాయకుడిగా ఆమోదముద్ర పడిందని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇంతకు మించిన మంచి సమయం దొరకదని, చేతికందొచ్చిన కొడుక్కి పార్టీ వ్యవహారాలతో పాటు ప్రభుత్వంలో ప్రధాన బాధ్యతను కూడా అప్పగించాలని చంద్రబాబు నిర్ణయించినట్లు సమాచారం. అందుకోసం 2027 ఉగాదిని ముహూర్తంగా పెట్టుకున్నట్లు కూడా విశ్వసనీయ వార్త. ఇదే నిజమైతే తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు మరో నాలుగు దశాబ్దాలకు సంబంధించి నాయకత్వ లోటు తీరినట్లే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

2లో



# లోకేష్ ముఖ్యమంత్రిగా కొత్త క్యాబినెట్!

(మొదటిపేజీ తరువాయి)

## యువగళంతో తిరుగులేని ఇమేజ్!

226 రోజులు, 3,132 కిలోమీటర్లు, కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు అలుపు లేని ప్రయాణం. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో ముందడుగువేసిన వైనం. ఇలా లోకేష్ యువగళం తెలుగుదేశం పార్టీకి అతిపెద్ద మైలేజ్‌నిచ్చింది. లోకేష్ స్థాయిని మరో మెట్టు, కాదుకాదు, మరో అంతస్తు పైకెక్కించింది. ఎందుకంటే తెలుగు భాషపై పట్టులేక, సభల్లో మాట్లాడే నైపుణ్యం లేక తన తొలిదశలో లోకేష్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షంతో పాటు ప్రజల నుంచి కూడా విమర్శలు, హేళనలు ఎదురయ్యాయి. అయితే, బంతిని ఎంత బలంగా కొడితే అంత ఎత్తుకు లేస్తుందన్నట్లు, లోకేష్ తనపై వచ్చిన విమర్శలనే సూచనలుగా, హెచ్చరికలుగా భావించి తనను తాను మలుచుకున్నారు. తొలుత పార్టీ కార్యకర్తలకు దగ్గరై వారిని ఉత్తేజపరుస్తూ వారివద్ద తన చరిష్మాను పెంచుకున్నారు. ఎమ్మెల్సీగా, మంత్రిగా రాజకీయ ఓనమాలను నేర్చుకున్నారు. తర్వాత కాలంలో యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టి ప్రత్యర్థులకు సింహస్వప్నంగా మారారు. మాటల తూటాలు పేలుస్తూ జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. సద్విమర్శలను స్వీకరిస్తూనే, దుర్విమర్శలను సమర్థంగా తిప్పికొట్టారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీలోని కీలక నాయకులకు దీటుగా బదులిచ్చారు. ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేసి, ఆయన్ని ప్రజల ముందు దోషిగా నిలబెట్టి అటు తనస్థాయినే కాకుండా పార్టీ ఇమేజ్‌ను కూడా అమాంతం పెంచేందుకు దోహదపడ్డారు. దీంతో చంద్రబాబు తర్వాత అంత సత్తా, సమర్థత ఉండే నాయకుడు లోకేష్ అంటూ, సగటు తెలుగుదేశం కార్యకర్త నిర్ణయానికొచ్చే పరిస్థితి తీసుకొచ్చారు. దీంతో లోకేష్‌కు అటూ పార్టీలోనూ తర్వాతవచ్చిన కూటమి ప్రభుత్వంలోనూ ఎదురులేకుండా పోయిందన్నది విశ్లేషకుల అభిప్రాయం.

## విద్యాశాఖమంత్రిగా అన్నీతానై!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాయకులు, కార్యకర్తలు డిప్యూటీ సీఎం పదవి చేపట్టాలంటూ, ఒత్తిడి చేసినా, పార్టీ వేదికలపై బలవంతపెట్టినా, పొత్తు ధర్మం మేరకు తమ కార్యకర్తలను లోకేష్ సున్నితంగా వారించారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, దాన్ని సమర్థంగా నిర్వహించి అన్ని వర్గాల నుంచి మంచిపేరు ప్రఖ్యాతులను లోకేష్ సంపాదించుకున్నారనే చెప్పాలి. ఎందుకంటే 2019–24 మధ్యకాలంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్ ప్రభుత్వ తీరుని ఎండగట్టడమే కాకుండా, పదవిలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ పేరుతో 16,500 టీచర్ పోస్టులను భర్తీచేసి యువతలో లోకేష్ తన క్రేజ్‌ను విపరీతంగా పెంచుకున్నారు. అలాగే టీచర్లకు హ్యాండ్‌బుక్, విద్యార్థులకు వర్క్‌బుక్స్, నైతిక విలువలను పెంపొందించడం కోసం చాగంటి కోటేశ్వరరావు వంటి ప్రవచనకర్తలతో ప్రత్యేక పుస్తకాలకు రూపకల్పన చేసి విద్యాశాఖపై లోకేష్ తన ముద్రను వేశారు. ఇదే క్రమంలో ఉపాధ్యాయ బదిలీలను గతంలోలాగా వివాదాస్పదం కాకుండా జాగ్రత్తపడి ఉద్యోగ సంఘాల దృష్టిలోనూ మంచి మార్కులే సంపాదించుకున్నారు. ఇక పార్టీ విషయానికొస్తే తనకు వయస్సు మీదపడుతుండడం, టీటీడీ భవిష్యత్ లోకేష్‌తో ముడిపడి ఉండడంతో చంద్రబాబు కూడా కీలక నిర్ణయం తీసుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే 2027లో లోకేష్‌కు ముఖ్యమంత్రిగా బాధ్యతలు అప్పగించి తాను సలహాదారుడిగా ఉంటూ 2029 ఎన్నికలకు వెళ్లాలని బాబు ప్రణాళికలు రచిస్తున్నట్లు టీడీపీలోని అంతర్గత ఆంతరంగిక వర్గాల సమాచారం. ఇదే నిజమైతే తెలుగుదేశం పార్టీలో కొత్తతరం నాయకత్వం, ఎలాంటి అడ్డంకులు లేకుండా తెరమీదికి వచ్చినట్లే.

## బీజేపీ కూడా అడ్డు చెప్పకపోవచ్చు!

ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం ఉన్నా అది చంద్రబాబు ప్రభుత్వంగానే ఫోకస్ అవుతూ ఉంటుంది. ఎందుకంటే తెలుగుదేశం పార్టీకి సొంతంగానే 135 ఎమ్మెల్యే స్థానాలు ఉండడంతో నాయకత్వ మార్పు నల్లేరుపై నడకలా సాగిపోయే అవకాశాలున్నాయి. ఇక కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం పూర్తికాలం మనుగడ సాగించాలంటే తెలుగుదేశం పార్టీకి ఉన్న 16 ఎంపీ సీట్లు అత్యంత కీలకం. ఇలాంటి సమయంలో తెలుగుదేశం పార్టీలో నాయకత్వ మార్పు విషయాన్ని బీజేపీ అడ్డుకునే పరిస్థితి ఉండదనేది విశ్లేషకుల భావన. ఇక లోకేష్ పనితనం రోజురోజుకూ మెరుగుపడుతుండడం, విజన్ 2047 లక్ష్య సాధన కోసం ప్రస్తుత మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణల్లో లోకేష్ వంటి యువ నాయకులకు పెద్దపీట వేస్తుండడం కూడా దీనికి ఓ కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చినబాబు లోకేష్ పెద్ద బాధ్యత చేపట్టేందుకు మార్గం సుగుమమైనట్లేనన్న పరిస్థితి కనిపిస్తోంది.

## రాబోవు రోజుల్లో రాటుదేల్చి!

గతంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు రాహుల్‌గాంధీకి కనీసం ఉపప్రధానిగా అయినా బాధ్యతలు అప్పగించి ఉంటే ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కొంత మెరుగ్గా ఉండేదని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార మత్తులో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్‌ను విస్మరించి, తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా సోనియాగాంధీ పరిస్థితి తయారయ్యిందని, అందుకే గత 12 సంవత్సరాలుగా దేశంలో ఆ పార్టీకి జవసత్వాలు లేకుండా పోయే దుస్థితి దాపురించిందని విశ్లేషకులు తరచూ చెప్తుంటారు. ఇక తెలంగాణ విషయానికొస్తే దశాబ్దకాలం పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ తనకు వయస్సు మీద పడుతోందని, చురుగ్గా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నామని తెలిసినా, కుమారుడు కేటీఆర్‌కు ముఖ్యమంత్రిగా బాధ్యతలు అప్పగించకుండా పొరపాటు చేశారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తుంటారు. అందుకే ప్రస్తుతం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ధీటుగా ఎదుర్కోలేకపోతున్నారని, హరీష్ రావు వంటి నేతలు పక్కలో బల్లెంలా ఉండడంతో పార్టీపై పూర్తి పట్టు సాధించే అవకాశం కేటీఆర్‌కు లేకుండా పోతోందని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితి లోకేష్‌కి రాకుండా దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా తాను యాక్టివ్‌గా ఉన్న సమయంలోనే లోకేష్‌కు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించి ఎన్నికలకి రెండేళ్ల ముందుగానే తనను తాను నిరూపించుకునే అవకాశం లోకేష్ ఇవ్వాలన్నది చంద్రబాబు ఆలోచనగా తెలుస్తోంది. దీంతో అటు తెలుగుదేశం నాయకత్వ బాధ్యతలతో పాటు ప్రభుత్వంలో పెద్ద బాధ్యతను కూడా లోకేష్ తన భుజాలకెత్తుకుంటారనే ప్రచారం సాగుతోంది. ఇటీవల రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణపై పెద్దఎత్తున చర్చలు జరుగుతున్నాయి. చాలా మంది ఆశావహులు ఆ శుభఘడియ కోసం ఎదురు చూస్తున్నారు. కానీ, చంద్రబాబు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. లోకేష్‌కి నాయకత్వ బాధ్యతలు అప్పజెప్పే ఆలోచనే ఆ ఆలస్యానికి ఒక కారణం అని కూడా అంటున్నారు. 2027లో లోకేష్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాతే మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించి యువరక్తంతో కొత్త టీంను రూపొందించాలని తెలుగుదేశం పార్టీ అధినేత నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏదేమైనా తెలుగు ప్రజలకు రాజకీయ చిహ్నంగా భావించే అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశానికి కొత్త నాయకత్వం త్వరలో రాబోతోందన్నది మాత్రం ఆ పార్టీలో అందరూ స్వాగతిస్తున్న సత్యం..!

గల్పిక

# ఢిల్లీకి చేరిన పవన్ - చంద్రబాబుల పంచాయతీ!

అక్టోబర్ నెలలో శ్రీశైలం సందర్శన, అనంతరం కర్నూలు పర్యటన. ఆ తరువాత బీహార్ ఎన్నికల ప్రచారం. మళ్లీ నవంబర్‌లో పుట్టపర్తితో పాటు తమిళనాడు తదితర ప్రాంతాలలో పర్యటనలు, సభలు.. ఇలా వరుస కార్యక్రమాలతో విసిగిపోయిన భారత ప్రధాని నరేంద్ర మోడీ ఓ మూడురోజులు విశ్రాంతి తీసుకుందామనుకున్నారు. పనిలో పనిగా బీహార్ గెలుపు సంబరాన్ని విదేశాలకి వెళ్ళి జరుపుకోవాలనుకున్నారు. G20 సదస్సులో పాల్గొనే నెపంతో నవంబర్ 21 నుండి 23వ తేదీ వరకూ సేద తీరడానికి సౌత్‌ఆఫ్రికా దేశంలోని జోహెన్నెస్‌బర్గ్ పర్యటనకి వెళ్లిపోయారు. అక్కడకి వెళ్లారనే కానీ, ఆయన మనసంతా తన పుట్టపర్తి పర్యటన గురించే ఆలోచిస్తోంది. "పోయినసారి కర్నూలుకి వెళ్ళినప్పుడు పవన్‌కళ్యాణ్ ప్రవర్తనకి ఈసారి పుట్టపర్తి విజిట్‌లో పవన్ కళ్యాణ్ బిహేవియర్‌కి చాలా తేడావుంది." ఆయన ఇదే ఆలోచిస్తున్నారు. "ఆంధ్రాలో ఏం జరుగుతోంది.. తెలుసుకోవాలి". ఈ ఆలోచన మనసులో మెదిలిన వెంటనే మోడీ ఫోన్ అందుకున్నారు, అమిత్‌షా నంబర్ డయల్ చేశారు.

ప్రధాని భారతదేశంలో లేకపోవడంతో హాయిగా ఇంట్లో కుటుంబంతో సేద తీరుతూ హోమ్ థియేటర్‌లో అమితాబ్ నటించిన తనకిష్టమైన పాత సినిమా 'షోలే' చూస్తుండిన అమిత్‌షా మోడీ ఫోన్‌తో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. వెంటనే సినిమా పాస్‌చేసి "హాజీ నమస్కార్ చెప్పండి.. అన్నారు". "షా భాయ్ ఆంధ్రాలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల మధ్య ఏదో కోల్డ్‌వార్ నడుస్తోంది. నేను రాగానే వాళ్ళిద్దరినీ పిలిపించండి, మనం మాట్లాడాలి" అని ఆదేశాలు జారీచేసి కాల్ కట్ చేశారు. "ఇదేం కొత్త తలనొప్పిరా నాయనా" అనుకుంటూ అమిత్‌షా తన సెక్రటరీకి ఫోన్ చేసి 24వతేదీ చంద్రబాబునాయుడిని, పవన్ కళ్యాణ్‌ని పి.యం.జీ ఢిల్లీకి రమ్మన్నారని చెప్పండి అంటూ ఫోన్ పెట్టేశాడు.

అత్యంత విశాలమైన ఓ గదిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూర్చుని ఉన్నారు. ప్రధాని నివాసంలోని ఆ గదిలో వాతావరణం గంభీరంగా ఉంది. ఇద్దరి మదిలో ఒకటే ఆలోచన, ఒకటే ప్రశ్న. "ఇంత హఠాత్తుగా మమ్మల్ని ఎందుకు రమ్మన్నారు. ప్రతిసారీ ప్రధానమంత్రి కార్యాలయంలో అపాయింట్‌మెంట్ ఇచ్చేవాళ్ళు, ఈసారి ప్రధాని నివాసానికి ఎందుకు పిలిపించినట్లు". ఇద్దరికీ ఇవే అనుమానాలు. అంతలో ప్రధానమంత్రి భద్రతా సిబ్బంది ముందుగా ఆ గదిలోకి వచ్చారు, వారి వెనకే నరేంద్ర మోడీ, అమిత్‌షా ఇద్దరూ ఒకేసారి ఆ రూములో అడుగుపెట్టారు.

చంద్రబాబు, పవన్ బాబు ఇద్దరూ.. వచ్చిన ఆ ఇద్దరికీ నమస్కారం పెడుతూ లేచి నిలబడ్డారు. మోడీ, అమిత్‌షా వాళ్ళ కుర్చీల దగ్గరకి రాగానే చంద్రబాబు ఎప్పటిలాగే మోడీకి చేనేత శాలువా కప్పి, వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందించారు. పవన్ మాత్రం ఒట్టి నమస్కారంతో సరిపెట్టారు. అంతా కుర్చీల్లో కూర్చున్నారు.

అమిత్‌షా వైపు చూసి మొదలుపెట్టమంటూ సైగ చేశారు మోడీ.

అమిత్‌షా చంద్రబాబు వైపు చూస్తూ 'బాబూజీ.. పవన్‌కళ్యాణ్ ఈమధ్య మూడీగా ఉంటున్నారట, మొన్న ప్రధానిజీ పుట్టపర్తికి వచ్చినప్పుడు గమనించారంట. మీ ఇద్దరిమధ్య ఏదైనా మిస్‌అండర్ స్టాండింగ్ ఉందా..' అడిగాడు. "నథింగ్ అమిత్ జీ... మేం కలిసే ముందుకిపోతున్నాం" బదులు చెప్పారు చంద్రబాబు. షా భాయ్ పవన్‌కళ్యాణ్ వైపు చూస్తూ "క్యా పవన్ భాయ్ మీరు చెప్పండి. ఏంటి ప్రాబ్లమ్..?".

అంతే... పవన్‌కళ్యాణ్ ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచి "సింహం పడుకుంది కదా అని జూలుతో జడెయ్యకూడదు. నేను సింహం లాంటోడిని, కాకపోతే అది గడ్డం చేసుకోలేదు.. నేను చేసుకోగలను అంతే తేడా, మిగతా అంతా సేమ్ టు సేమ్.. అ.. అ" అని ఆవేశంగా చెప్పి, కోపంగా చంద్రబాబు వైపు చూస్తూ మళ్ళీ తన కుర్చీలో తాను కూర్చున్నాడు.



పవన్ ప్రవర్తన చూసి మోడీ, అమిత్‌షా, చంద్రబాబు ముగ్గురూ ఖంగుతిన్నారు. వెంటనే మోడీ తేరుకుని "ఏ సింహం, పులి క్యాహై" అంటూ అమిత్‌షా వైపు విసుగ్గా చూశారు.

వెంటనే చంద్రబాబు కలగజేసుకుని "ఏం జరిగింది పవన్‌కళ్యాణ్ గారూ, ఎందుకలా మాట్లాడుతున్నారు..?" అని అడిగారు.

కనీసం చంద్రబాబు ముఖమైనా చూడకుండా పవన్‌కళ్యాణ్ అమిత్‌షా వైపు తిరిగి.. "మీరే న్యాయం చెప్పండి షాజీ, నేను ఏ మీటింగ్‌లో పాల్గొన్నా మరో 15 సంవత్సరాలు చంద్రబాబుగారే మా నాయకుడు అని చెప్తున్నా. మరో 15 సంవత్సరాలు కూటమి కలిసే ఉంటుందని హామీ కూడా ఇస్తున్నా. చంద్రబాబు గారూ, లోకేష్ ఎక్కడా అలాంటి మాట చెప్పడంలేదు. పైగా నా అభిప్రాయాలు కొన్నిటితో వ్యతిరేకిస్తున్నారు. మా ఎం.ఎల్.ఏలు తప్పు చేస్తున్నారని నన్ను నిలదీస్తున్నారు. ఏ అచ్చా హైక్యా..?" అంటూ ఆవేశంగా తన సొద వెళ్ళగక్కారు. పవన్ ఆవేశం చూసి బిత్తరపోయిన చంద్రబాబు "అలాంటిదేం లేదు షాజీ... మేం కలిసే ముందుకిపోతున్నాం" మళ్ళీ అదే చెప్పారు.

"ఆప్ బోలియే (మీరు చెప్పండి) అంటూ పవన్ వైపు చూశారు అమిత్‌షా. "రాజధాని అమరావతిలో రెండవ విడత భూమి సేకరణ ఇప్పుడే వద్దన్నాను, నా మాట వినలేదు. తెలుగుదేశం ఎం.ఎల్.ఏలు అవినీతిలో మునిగిపోయి బరితెగించి బలిసిపోతున్నారు. అది మంచిది కాదని నేను సలహా ఇచ్చాను, ఆ విషయం విడిచిపెట్టి మా యలమంచిలి ఎం.ఎల్.ఏని కొంచెం గమనించుకోండి అని బాబు గారు తిరిగి నాకే సలహా ఇస్తున్నారు. ఇది కరెక్టా మోడీ సార్, అమిత్‌జీ మీరే చెప్పండి అ.. అ" అంటూ పవన్ ఊగిపోయారు.

విషయం ఆసాంతం విన్న మోడీ, అమిత్‌షా కొంచెంసేపు మౌనం పాటించారు. ఆ తరువాత ఇద్దరూ ఒకరి చెవులో ఒకరు గుసగుసలాడుకున్నారు. "నాకు విషయం అర్థమయ్యింది. షాజీ మీతో మాట్లాడుతారు. ఇక గొడవలేమీ లేకుండా సర్దుకుపోండి." అంటూ లేచి నమస్కారం పెట్టి ఇంట్లో మరో గదిలోకి వెళ్లిపోయారు.

అమిత్‌షా చంద్రబాబుని దగ్గరకి రమ్మని "బాబూజీ మీరు పవన్‌కళ్యాణ్‌కి ఇవ్వాల్సిన ప్యాకేజీ సరిగ్గా ఇస్తున్నట్లు లేదు. ఆ విషయంలో మమ్మల్ని చూసి నేర్చుకోండి. ఆంధ్రాకి వెళ్ళగానే ఆయనకి చేరవలసింది ఆయనకి చేర్పించండి. 'కలిసిఉంటే కలదు సుఖం'" అంటూ ఓ సినిమా పేరు చెప్పి పైకి లేచాడు.

"అలాగే అమిత్‌జీ – మీరు చెప్పినట్లుగానే ముందుకుపోతాం" అంటూ చంద్రబాబు పవన్ వైపు నడిచాడు.

అమిత్‌షా కూడా పవన్ వైపు చూస్తూ.. "పవన్ కళ్యాణ్‌జీ మీ ఫ్రస్ట్రేషన్ అర్థమయ్యింది. బాబూజీ ఇకముందు అన్నీ చూసుకుంటారు. నో ఫైటింగ్స్. మీకు ఏం కావాలో అర్థమయ్యే విధంగా అడిగి సాధించుకోండి" అని చెప్పి ఒక నమస్కారం పెట్టి ఆయన కూడా లోపలికి వెళ్ళిపోయాడు.

అక్కడ ఏం జరిగిందో పవన్ అర్థం చేసుకునే లోపే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బుజంపై చెయ్యి వేసి "కలిసుందాం రా... బ్రదర్" అంటూ పవన్‌ని కూడా నడిపించుకుంటూ ఆ గది నుండి బయటకి తీసుకొచ్చారు. అసలు ఏం జరిగిందో అర్థం కాని పవన్.. "నేనేం చెప్పాను.. వీళ్ళకేమి అర్థమైంది..?" అని మనసులో అనుకుంటూ బాబు వెంటే నడుచుకుంటూ ప్రధాని ఇంటి నుండి నిష్క్రమించారు.

\- చిన్నబ్బయ్య






# జిల్లా విద్యారంగానికే తలమానికంగా అంతర్జాతీయ ప్రమాణాలతో..

# జీవీకే స్కూలు

- తమ పిల్లలని ఇక్కడ చదివించడానికి పోటీపడుతున్న అమ్మానాన్నలు
- జిల్లాలో తాము ఇలాంటి స్కూలుని చూడలేదంటూ ప్రశంసల వర్షం

**చి**రకాల కల సాకారమయ్యింది. సామాన్యులకి అందుబాటులో అసామాన్యమైన విద్యావ్యవస్థని తీసుకురావాలన్న దాతల ఆశయం నెరవేరింది. సుప్రసిద్ధ పారిశ్రామికవేత్తలు, మన నెల్లూరీయులు 'పద్మభూషణ్' బిరుదాంకితులు డాక్టర్ జీ.వీ.కే.రెడ్డి దాతృత్వంతో సుమారు 30 కోట్ల రూపాయల వ్యయంతో, నెల్లూరునగర నడిబొడ్డులో శ్రీ కస్తూరిదేవీ విద్యాలయం ప్రాంగణంలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో GVK స్కూల్ ఆవిష్కృతమయ్యింది. 2025-2026 విద్యాసంవత్సరంలోనే విద్యార్థి లోకానికి తన సేవలు అందించేలా విద్యాసంవత్సరానికి అవసరమైన అడ్మిషన్లని పూర్తి చేసుకున్న ఈ సంస్థ.. విద్యావనంలో వికసించిన కుసుమంలా నెల్లూరులో ఆవిర్భవించింది. తొలి ఏడాది నర్సరీ నుండి 7వ తరగతి వరకు క్లాసులని ఆరంభించి నిరాడంబరంగా తమ సేవలని మొదలుపెట్టింది GVK స్కూలు. మొదటి విద్యాసంవత్సరంలోనే ఈ సంస్థ చిన్నారుల తల్లితండ్రుల విశేష ప్రశంసలని, అభినందనలని అందుకుంటోంది. వచ్చే ఏడాది అడ్మిషన్ల కోసం పిల్లల పేరెంట్స్ ఇప్పటినుండే పోటీపడేలా ఈ స్కూలు గుర్తింపుని సాధించింది.

**క**స్తూరిదేవి సంస్థలలో ఏదో జరిగిపోతోందని గుండెలు బాదుకుంటూ, అసత్యపు ప్రచారాలు చేసిన వాళ్ళ నోళ్ళు మూయించేలా డాక్టర్ జీ.వీ.కే.రెడ్డి దాతృత్వంతో సుమారు 30 కోట్ల రూపాయల వ్యయంతో GVK స్కూలు ఆవిష్కృతమయ్యింది. శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ అజమాయిషీలోనే, కమిటీ సారథ్యంలోనే... ఈ స్కూలు నిర్వహింపబడుతోంది.











## ఆధునిక వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం!

విశాలమైన తరగతి గదులలో, అధునాతనమైన సాంకేతిక వసతులతో, అత్యంత అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో, అంకితభావంతో పనిచేసే బోధనేతర సిబ్బందితో అంతర్జాతీయ స్థాయి విద్యాభోదనే ధ్యేయంగా, ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా, చిన్నారుల మానసిక వికాసమే ఆశయంగా ఈ పాఠశాల నెల్లూరీయుల సేవలో పునీతమవుతోంది.

మొత్తం 3ఎకరాల విశాలమైన స్థలంలో 72వేల చదరపు అడుగుల నిర్మాణాన్ని పూర్తిచేశారు. 54 సెంట్ల విస్తీర్ణంలో 59 గదులని, మూడు అంతస్తులలో నిర్మించారు. వీటిలో 27 గదులని క్లాసుల కోసం కేటాయించి, మిగిలిన 32 రూములని, అంతర్జాతీయ స్థాయి కంప్యూటర్ ల్యాబ్, పరిశోధనాత్మక పరికరాలతో కూడిన సైన్సుల్యాబ్, విస్తృతజ్ఞాన సంపద కలిగిన ఆధునిక గ్రంధాలయం వంటి వాటితో పాటు ఇతర విభాగాల పరిపాలనా సౌలభ్యం కోసం ఉపయోగిస్తున్నారు. ఒక్కొక్క తరగతి గది 600చదరపు అడుగులు ఉండేలా డిజైన్ చేశారు. ప్రధాన భవనం నిర్మాణానికి వినియోగించగా మిగిలిన 2.46 యకరాల స్థలాన్ని క్రీడా మైదానం, ఉద్యానవనం, పార్కింగ్ వంటి వాటి కోసం కేటాయించారు.

నర్సరీ నుండి ఇంటర్మీడియట్ విద్య వరకూ ఒకే ప్రాంగణంలో అందించాలన్నది నిర్వాహకుల భవిష్యత్ కార్యచరణ. రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా ఈ విద్యా సముదాయాన్ని తీర్చిదిద్దాలన్నది వారి తపన. ఆ దిశగా ఇప్పటినుండే బలమైన పునాదులు వేసుకుంటూ, నాణ్యమైన విద్యా వసతులకి ప్రాధాన్యత కల్పిస్తూ, ఎక్కడా రాజీపడకుండా అంకితభావంతో ఈ విద్యాసంస్థ నిర్వాహకులు తమ కార్యకలాపాలని కొనసాగిస్తున్నారు.

## విద్యార్థుల పరిపూర్ణ పరిపక్వతే లక్ష్యంగా!


తమ GVK స్కూల్లో చదివే విద్యార్థినీవిద్యార్థులు భవిష్యత్తులో అన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలలో పాల్గొనడానికి సంసిద్ధులుగా వుండే విధంగా సీబీఎస్ఈ (CBSE) సిలబస్‌లో శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా ఆంగ్లంలో అనర్గళంగా చదివి, రాసి మాట్లాడగలిగేలా తర్ఫీదు ఇచ్చి వారి మేధస్సుకి పదునుపెడుతున్నారు. క్రీడలపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహిస్తున్నారు. శారీరక దృఢత్వం, స్వీయ ఆత్మసంరక్షణ వంటి అంశాలని దృష్టిలో పెట్టుకుని మార్షల్ ఆర్ట్స్‌లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు. పిల్లల ఆసక్తిని బట్టి సంగీత, నృత్య, కళా విభాగాలలో అగ్రగణ్యులుగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నారు. GVK స్కూలు స్టూడెంట్స్ అంటే అన్ని విభాగాలలో పరిపూర్ణ పరిపక్వత కలిగిన వారిలా ఉండాలనే దృఢ సంకల్పంతో కృషి చేస్తున్నారు. విద్యార్థులలో వుండే ఆసక్తిని గమనించి, వారికి ఇష్టమైన, వారు కోరుకున్న విభాగంలో వారిని అగ్రభాగాన నిలపాలన్నది నిర్వాహకుల ఆలోచనగా ముందుకు సాగుతున్నారు.

## పొంగిపోతున్న తల్లితండ్రులు!

తమ పిల్లలని ఇలాంటి అద్భుతమైన పాఠశాలలో చదివిస్తామని తాము కలలో కూడా ఊహించలేదని ఇప్పటికే GVK స్కూలులో తమ పిల్లలని చేర్పించిన అమ్మానాన్నలు పొంగిపోతున్నారు. అదీ, నెల్లూరు నడిబొడ్డులో సామాన్యుడికి అందుబాటైన ఫీజులతో, అంతర్జాతీయ ప్రమాణాలతో GVK స్కూలు రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని సంబరపడుతున్నారు. తమ చిన్నారులు ఇలాంటి మంచి స్కూలులో చదువుకోవాలనే తమ చిరకాల కల నెరవేరిందని సంతోష పడుతున్నారు. మహానగరాలకి ధీటుగా నెల్లూరులో GVK స్కూలు తమకి చేరువగా వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కో-ఎడ్యుకేషన్ కోసం వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులు!

సంస్థ ప్రారంభమైన తొలిఏడాది కేవలం బాలికలకే ప్రాధాన్యత ఇచ్చి అడ్మిషన్లు చేసుకున్నారు. అయితే, ఇంత బ్రహ్మాండమైన స్కూలుని కేవలం అమ్మాయిలకే పరిమితం చేయడం అన్యాయం అంటూ చాలామంది పిల్లల తల్లితండ్రులు వాపోతున్నారు. తమ కూతురుని ఇంత పెద్ద స్కూలులో చేర్పించి, కొడుకుని మరో స్కూలులో చేర్పించాలంటే తమకే బాధగా ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంనుండైనా అబ్బాయిలకి కూడా GVK స్కూలులో చదువుకునే అవకాశం కల్పించాలని శ్రీ కస్తూరిదేవీ విద్యాలయ కమిటీని, GVK స్కూలు నిర్వాహకులని వేడుకుంటున్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ దశలో వచ్చే ఏడాది నుండి మగపిల్లలకి కూడా అవకాశం కల్పించే ఆలోచనలో పాఠశాల నిర్వాహకులు, కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లని కూడా 2025 డిసెంబరు నుండే మొదలు పెట్టనున్నట్లు కూడా నిర్వాహకులు చెప్తున్నారు. మొత్తం మీద, GVK స్కూలు ఆవిర్భావంతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందేలా శ్రీ కస్తూరిదేవి విద్యాలయ సంస్థకి ఖ్యాతి లభించిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం కావడం గమనార్హం.



లాయర్
నవంబర్ 28, 2025

# కబడ్డీలోనూ భారతీయ మహిళలే చాంపియన్లు!

ప్రపంచ క్రీడారంగంలో భారతీయ మహిళలు అద్వితీయ విజయాలను సాధిస్తూ, భారత కీర్తిపతాకను రెపరెపలాడిస్తున్నారు. వేదిక ఎక్కడైనా, క్రీడ ఏదైనా సరే తమకి ఎదురే లేదంటూ ముందుకు దూసుకుపోతున్నారు. అది క్రికెట్టయినా, కబడ్డీ అయినా, చివరికి అంధుల విభాగంలో జరిగే ప్రపంచ స్థాయి క్రికెట్టయినా సరే భారతీయ మహిళలే అగ్రస్థానం సాధిస్తూ.. ప్రపంచ క్రీడారంగ చరిత్రలో కొత్త అధ్యాయాలు సృష్టిస్తూనే ఉన్నారు. ఇటీవలే దక్షిణాఫ్రికాను ఓడించి భారత మహిళల క్రికెట్ జట్టు ప్రపంచ కప్‌ను గెలుచుకుని విశ్వ విజేతలుగా నిలిచి విజయకేతనం ఎగురవేసిన విషయం తెలిసిందే. అదే స్ఫూర్తితో ఒక్క క్రికెట్‌లోనే కాదు.. కబడ్డీలోనూ తమకెవరూ సాటిలేరంటూ భారతీయ మహిళలు ఇటీవల ప్రపంచ వేదికపై మరోసారి తమ సత్తాను చాటుకున్నారు. అద్భుతమైన ప్రతిభాపాటవాలతో కబడ్డీలో రెండోసారి ప్రపంచ కప్‌ని సాధించి భారత్ కీర్తిప్రతిష్టలను మారుమోగించారు.

బంగ్లాదేశ్‌లోని ఢాకాలో ఈనెల 24న జరిగిన మహిళల కబడ్డీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో రీతూ నేగి సారథ్యంలో భారత జట్టు అద్వితీయంగా ఆడి చైనా జట్టును చిత్తుచేసింది. 35-28 పాయింట్ల తేడాతో భారతీయ మహిళలు ప్రపంచకప్‌ని అవలీలగా కైవసం చేసుకున్నారు. ఒక దశలో రీతూ గాయపడినప్పటికీ, ఎలాంటి వత్తిడికి గురికాకుండా, పట్టిన పట్టు విడవకుండా భారత జట్టు ఆటలో ఆధిక్యం ప్రదర్శించింది. ఆమెతో పాటు సంజూదేవి, పుష్ప రాణా, చంపా ఠాకూర్, భావనా ఠాకూర్, సాక్షి శర్మ తదితర క్రీడాకారులంతా జట్టులో బాగా రాణించారు. మొత్తంగా 11 దేశాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. వరుసగా గ్రూప్ దశలో థాయిల్యాండ్, బంగ్లాదేశ్, జర్మనీ, ఉగాండా జట్లను ఓడించిన భారత్ జట్టు, సెమీ ఫైనల్స్‌లో ఇరాన్ జట్టుతో తలపడింది. కబడ్డీలో ఇరాన్ జట్టు అంటే ఎంతో పటిష్టమైనదని పేరు. అలాంటి ఇరాన్ జట్టును కూడా అదరగొట్టి భారత్ జట్టు సునాయాసంగా 33-21 పాయింట్ల తేడాతో ఇరాన్‌ని ఓడించి ఫైనల్స్‌కి చేరుకుంది. చైనాని కూడా ఓటమి పాలుచేసి భారత్ తన ఆధిక్యతను చాటుకుంటూ ప్రపంచకప్‌ని చేపట్టింది. 2012లో కూడా భారత్ జట్టు తొలి ప్రపంచకప్ పోటీల్లో ఇరాన్‌పై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. అదేవిధంగా ఇప్పుడు కూడా ఇరాన్ జట్టును మట్టికరిపించి రెండోసారి జగజ్జేతగా నిలవడంతో భారతీయ మహిళా క్రీడాకారులకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

అంతేకాదు, ప్రపంచస్థాయిలో అంధుల క్రికెట్ పోటీల్లోనూ మన భారతీయ మహిళలు తమ ప్రతిభా పాటవాలను చాటుకుంటూ విజయఢంకా మోగించారు. శ్రీలంకలోని కొలంబోలో తొలిసారిగా నిర్వహించిన అంధుల టీ20 క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో విజయం సాధించడం ఈ ఏడాది చివరలో మరో అద్భుత ఘట్టమనే చెప్పవచ్చు. భారత్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, శ్రీలంక, యుఏఇ, నేపాల్ దేశాలు పోటాపోటీగా ఆడాయి. సెమీస్‌లో మన జట్టు పాకిస్థాన్‌ని ఓడించి ఫైనల్స్‌కి చేరుకుంది. తెలుగమ్మాయి దీపిక సారథ్యంలో భారత్ జట్టు తమ సత్తాను చాటుకుంది. ఈనెల 23న జరిగిన ఫైనల్స్‌లో 7 వికెట్ల తేడాతో నేపాల్‌ని ఓడించి భారత జట్టు ప్రపంచకప్‌ని సాధించడం అపూర్వం. కేవలం 114 పరుగులకే నేపాల్‌ని కట్టడి చేసి, 12 ఓవర్లలో 117 పరుగులతో భారత జట్టు సునాయాసంగా విజయం సాధించింది. జట్టులోని సరిత, పౌలా సొరెన్, పాంగి కరుణకుమారి తదితర క్రీడాకారులంతా మైదానంలో మెరుపులు మెరిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆరు దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మకమైన పోటీల్లో దీపిక బృందం ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా ముందుకు సాగి, ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవడం విశేషం! ఈ జట్టులో సత్యసాయి జిల్లాకి చెందిన దీపిక భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించగా, మరో తెలుగమ్మాయి.. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మన్యంకి చెందిన కరుణకుమారి సాటిలేని ప్రతిభతో జట్టును విజయపథానికి చేర్చారు. కరుణకుమారి ప్రస్తుతం విశాఖలోని అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. భారతజట్టు ప్రపంచకప్ సాధించడంలో వీరిద్దరిదీ కీలకపాత్ర. ఈ విజయ సాధనతో భారత అంధుల మహిళా క్రికెట్ జట్టు ప్రతిభ అనన్యసామాన్యం అనిపించుకుంటూ అందరి ప్రశంసలూ అందుకుంటోంది. ఏదేమైనా ప్రపంచ వేదికపై భారతీయ మహిళలు సాధిస్తున్న ఈ విజయాలు నేటి తరానికే కాక, భావిభారత క్రీడాకారులకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు!...




# నరమేధానికి పాల్పడుతున్న అక్షర మేధావులు!

సమాజం కొత్త పుంతలు తొక్కుతోంది. మానవుల మేధస్సు వెర్రితలలు వేస్తోంది. మేధావుల మెదడు మొరటబారిపోయింది. జనహితం కోసం వాడాల్సిన తమ తెలివిని కొంతమంది జనహతం కోసం వాడుతున్నారు. రాత్రింబవళ్ళు కష్టపడి సంపాదించిన విజ్ఞానాన్ని తమ అజ్ఞానంతో విధ్వంసాలకి వినియోగిస్తున్నారు. తమ మేధోసంపత్తితో ప్రజల ప్రాణాలని కాపాడాల్సిన వాళ్ళే ప్రాణాలని కాటేసేలా క్రూరత్వానికి తెగబడుతున్నారు. అక్షరాస్యులుగా పట్టభద్రులైన వారే రాక్షసులుగా మారి మానవ బాంబులుగా అవతరిస్తున్నారు. ఒకప్పుడు కేవలం చదువు సంధ్య లేకుండా అడ్డాలు తిరిగేవాళ్ళే ఉగ్రవాదంలోకి ఆకర్షింపబడే వాళ్ళని నానుడి. ఉగ్రవాద సంస్థలు సైతం నిరక్షరాస్యులని, మైనర్లని, అనాధలని చేరదీసి శిక్షణ ఇచ్చేవని మనం వినేవాళ్ళం. ఎలాంటి విచక్షణ, జాలి, దయ, కరుణ లేకుండా మనుషుల ప్రాణాలని అతి కిరాతకంగా పొట్టనపెట్టుకోవాలంటే అలాంటి వారైతేనే తమ ప్రాణాలకి సైతం తెగించి చెప్పింది చెప్పినట్లు చేస్తారని ఉన్మాదుల గట్టినమ్మకంగా ఉండేదని చెప్పుకునేవాళ్ళు. ఇప్పుడు కాలం మారింది. అక్షర జ్ఞానాన్ని అవపోసన పట్టిన వాళ్ళు సైతం ఉన్మాదులుగా మారుతున్నారు. మానవ బాంబులుగా మారి మనమధ్యే తిరుగుతున్నారు. మతోన్మాదంతో ఉచ్ఛం, నీచం మరచి వ్యవహరిస్తున్నారు. దారుణ మారణకాండకి తెగబడుతున్నారు. తాము నేర్చుకున్న విద్యని, తాము చదువుకున్న చదువుని దుర్వినియోగం చేస్తున్నారు. ఘోరమైన దురాగతాలకు తెగబడుతున్నారు. తమని మేధావులుగా తీర్చిదిద్దిన భారతదేశాన్ని ప్రగతిపథంలో నడిపించి ఋణం తీర్చుకోవలసిన వాళ్ళు అత్యంత దారుణంగా ప్రవర్తిస్తున్నారు. ఏ మాత్రం పాపభీతి అన్నదే లేకుండా అమాయకుల ప్రాణాలని అమాంతం తీసేస్తున్నారు. మేధావులుగా మారి జనంలో కలిసిపోతున్నారు. అదను చూసుకుని నరమేధాన్ని సృష్టిస్తున్నారు. ముఖ్యంగా మనదేశంలో ఇలాంటి అరాచక ప్రవృత్తి పెరిగిపోతోంది. ఏ కొద్ది మందో చేసే దుష్టక్రియల వల్ల మొత్తంగా మేధావి వర్గానికే అపకీర్తి వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉన్నత చదువులు చదివిన వారు సైతం ఇలా పశువుల్లా మారడం సమాజాన్ని విస్మయపరుస్తోంది. సాక్షాత్తూ దేశ రాజధానిలోని ఎర్రకోట వద్ద ఇటీవల జరిగిన బాంబుపేలుడు వెనుక ఉన్న కుట్రలు, ద్రోహాలు బయటపడినప్పటినుంచి దేశవ్యాప్తంగా ఇదో పెద్ద సంచలనంగా మారింది. ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న భయం, అనుమానం సామాన్య జనంలో ఎక్కువైపోయింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని క్షణం క్షణం బిక్కు బిక్కు మంటూ జీవించాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

## వైద్యుల ముసుగులో ఉగ్ర సారధులు!

సహజంగా డాక్టర్లు, ఇంజనీర్లు వంటి వారెందరో మేధావి వర్గాల్లో వుంటారు. అలాంటి వారిని చూస్తే ప్రజలకి అపార గౌరవం. కానీ, ఇప్పుడు అదే మేధావి వర్గంలోని చాలామంది దారి తప్పుతున్నారు. తమ చిత్తప్రవృత్తికి వ్యతిరేకంగా చివరికి వృత్తి ధర్మాన్నే పణంగా పెడుతున్నారు. తమ విజ్ఞానాన్ని మేధాశక్తిని విధ్వంసాలు సృష్టించడానికి, దేశద్రోహ కార్యకలాపాలకి సైతం ఉపయోగిస్తున్నారు. వారి విపరీత ధోరణి చూసి దేశమంతా విస్తుపోతోంది. 'వైద్యో నారాయణో హరీ' అంటూ వైద్యులను దేవుళ్ళుగా చూసే మన పవిత్ర భారతదేశంలో, అలాంటి ఉత్తమ వైద్యవృత్తి ముసుగులో దేశద్రోహులు కూడా ఉంటున్నారని తెలిసి ప్రజలు అవాక్కయిపోతున్నారు. ఢిల్లీ పేలుళ్లలో ప్రధానపాత్ర పోషించింది వైద్య బృందమే అని తెలుసుకుని నివ్వెరపోతున్నారు.

మరో ఘటనలో హైదరాబాదుకి చెందిన ఓ వైద్యుడు ఆముదం గింజల ద్వారా 'రిసిన్' అనే విషాన్ని ఉత్పత్తి చేసి, దాన్ని మత విధ్వంసానికి, మానవ మారణహోమాలకి ఉపయోగించడం కోసం హిందూ దేవాలయాలని వేదికగా చేసుకుని కోనేటి నీటిని, పవిత్ర ప్రసాదాలని ఆసరా చేసుకోవాలనే వ్యూహం రచించాడని తెలుసుకుని యావత్ హిందూ సమాజం విస్మయానికి గురయ్యింది.

## మేధావులే ఉగ్రవాదులుగా మారితే?...

తాజాగా ఈనెల 20న సుప్రీంకోర్టులో కూడా ఇలాంటి అంశాలపైనే చర్చ జరిగింది. 2020లో ఢిల్లీలో జరిగిన అల్లర్ల కేసులో కీలకనిందితుడు ఓ ఇంజనీరింగ్ విద్యార్థి అని పోలీసులు తేల్చారు. ఢిల్లీ పోలీసుల తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టులో మాట్లాడుతూ, "ఈ మధ్యకాలంలో డాక్టర్లు, ఇంజనీర్లు దేశద్రోహ కార్యకలాపాల్లో పాలుపంచుకునే ధోరణి పెరిగిపోయిందని, మేధావులు ఉగ్రవాదులుగా మారితే మరింత ప్రమాదకరమని" నేరుగా సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలియజేశారు. 53 మంది చనిపోయిన ఆ అల్లర్ల ఘటన అతిపెద్ద కుట్ర, క్షేత్రస్థాయిలో పనిచేసే ఉగ్రవాదులకంటే ఇదెంతో ప్రమాదకరం" అని కూడా ఆయన వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారవుతోందో మనం ఊహించుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇవన్నీ ఆ ఉగ్రరాకాసుల పన్నాగాల్లో భాగాలే. తమ పైశాచిక ప్రవృత్తితో అమాయక ప్రజల ప్రాణాలు తీస్తూ, దేశద్రోహానికి ఒడిగడుతున్న ఇలాంటి దుండగుల పట్ల ప్రజలు ప్రతీక్షణం అప్రమత్తతతో ఉండాలి. ఎక్కడైనా ఎవరిపైనైనా అనుమానం వస్తే వెంటనే భద్రతాధికారులకి ఉప్పందించాలి. మనకెందుకులే అని ఉపేక్షిస్తే అది మన ప్రాణాలకే ముప్పుకావచ్చు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఉగ్రవాదులను కానీ, ఉగ్రవాద చర్యలను కానీ ఎవరూ సహించకూడదు. ఉగ్ర పిశాచాల పీచమణిచేందుకు ప్రభుత్వాలు కూడా భద్రతా-నిఘా వ్యవస్థలను మరింతగా పటిష్టం చేయాలి. ముఖ్యంగా, మేధావుల ముసుగులో దేశద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతున్న ఉగ్ర మూకల పట్ల అప్రమత్తంగా లేకుంటే కేవలం ప్రజల ప్రాణాలకే కాదు దేశానికి కూడా ప్రమాదమే. శత్రువులు ఎక్కడో ఉండరు.. డాక్టర్ల రూపంలోనో, ఇంజనీర్ల రూపంలోనో లేక ఏ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూపంలోనో మన మధ్యే తిరుగుతుంటారు. తస్మాత్ జాగ్రత్త!.. - రాజశ్రీ

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# అది ప్రభుత్వమైనా.. ట్రస్టు బోర్డులైనా.. పాలకులే బాధ్యులు!

గత వారం మన 'లాయర్'లో 'నిర్ణయం బోర్డుదైతే.. అధికారులెందుకు' పతాక శీర్షికలో వచ్చిన వార్త చదివాను. నిజానికి ప్రభుత్వ వ్యవస్థలైనా, టీటీడీ లాంటి స్వయం ప్రతిపత్తి కలిగిన ట్రస్టు బోర్డులైనా అంతిమ నిర్ణయం రాజకీయ నాయకులదే. తమ నేతలు చెప్పింది అధికారులు చేయాల్సిందే. ఏదైనా నిర్ణయం బోర్డు తీసుకుంటే దానిని అమలు పరచడం అధికారుల బాధ్యత. అదే నిర్ణయాలు క్యాబినెట్ తీసుకుంటే వాటిని అమలు చేయాల్సింది కూడా ఆయా శాఖల అధికారులు, సిబ్బందే. మొత్తానికి తీసుకొన్న నిర్ణయం సరియైనది కాకపోతే దాని బాధ్యత కూడా బోర్డు/క్యాబినెట్ వహించాల్సి ఉంటుంది. కానీ, ఏదైనా తప్పు దొర్లినప్పుడో, అవినీతి డొల్లతనం బయటపడినప్పుడో మాత్రం తాము తప్పించుకునే క్రమంలో నేతలు దానిని అధికారులపైకి నెట్టేస్తున్నారు. ఒకవేళ నిర్ణయం ప్రజారంజకంగా ఉంటే దాని క్రెడిట్ మాత్రం పాలకులే తీసుకుంటున్నారు. ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయమే. ఈ రోజు మనం కొత్తగా చూస్తున్నది కాదుకదా!

- యం. విజయలక్ష్మి, మాజీ న్యాయమూర్తి, హైదరాబాదు.

# సిగ్నెళ్ళు కాదు.. భయం కావాలి!

మొన్న ఆదివారం మునిసిపల్ మంత్రి నారాయణ గారు, ఎంపీ ప్రభాకరరెడ్డి గారూ నెల్లూరు నగరంలో కొన్ని ముఖ్యకూడళ్లలో ట్రాఫిక్ సిగ్నెళ్ళు ప్రారంభించారు. చాలా సంతోషం. కానీ, నెల్లూరు నగరంలో ముందుగా కావలసింది ఇలాంటి వసతులు కాదు. ముఖ్యంగా పోలీసులంటే భయం ఉండాలి. భయమే ఉంటే ట్రాఫిక్ దానంతట అదే క్రమబద్ధీకరణ అవుతుంది. నగరంలో వాహనాలు అంతకంతకీ రెట్టింపు అవుతున్నాయి. వన్‌వేలలో వెళ్ళేవాళ్ళు ఎక్కువైపోయారు. ద్విచక్ర వాహనాలలో త్రిబుల్ రైడింగ్ పెరిగిపోయింది. పార్కింగ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. పోలీసులంటే పూర్తిగా భయం పోయింది. కేవలం సిగ్నెళ్ళు పెట్టినంత మాత్రాన ట్రాఫిక్ బాగుపడిపోతుందనుకుంటే అది కేవలం భ్రమే. రెడ్‌సిగ్నెల్ చూసి కూడా చూడనట్లుగా వెళ్ళే ఘనులు మన నెల్లూరులో చాలామందే వున్నారు. ముందుగా ప్రజలలో చైతన్యం కలిగించాలి. వాహనదారులకు పోలీసులంటే హడలు పుట్టించాలి. తప్పు చేసిన వారిపై కేసులు రాసి భారీగా ఫైన్లు వేస్తే మార్పు దానంతట అదే వస్తుంది!

- ఆర్. పి. రామయ్య, కొండాయపాలెం.

# కలవరపెడుతున్న కాలుష్యం!

మన దేశంలో వాయు కాలుష్యం ఇప్పుడో పెద్ద సమస్యగా మారిపోయింది. ముఖ్యంగా ఢిల్లీ, ముంబై, కలకత్తా, బెంగళూరు, చెన్నై, హైదరాబాదు వంటి మహా నగరాలలో ఈ సమస్య రోజురోజుకీ జటిలమవుతోంది. వాయు కాలుష్యంతో పాటు శబ్ద కాలుష్యం కూడా సమాంతరంగా పెరిగిపోతోంది. పర్యావరణ పరిరక్షణతోనే ఈ సమస్యకి కొంతైనా పరిష్కారం లభిస్తుంది. కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరాలలో పార్కుల ఏర్పాటుకి ప్రభుత్వాలు కృషి చేయాలి. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన అమ్మ పేరుతో ఓ మొక్క కార్యక్రమానికి ప్రభుత్వాలు విస్తృత ప్రచారం కల్పించాలి. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఒక మొక్కని నాటి దానిని పరిరక్షించుకునేలా పౌరులని చైతన్యపరచాలి. లేఅవుట్లలో, అపార్ట్‌మెంట్ సముదాయాలలో, ఇండిపెండెంట్ నివాసాలలో మొక్కల పెంపకం తప్పనిసరి చేయాలి. నేటి మొక్కలే రేపటి మహావృక్షాలై కాలుష్య రక్కసి నుండి భావి తరాలని రక్షిస్తాయన్న నిజాన్ని ప్రతి పౌరుడూ గ్రహించాలి!

బి. నారాయణరెడ్డి, బెంగళూరు.

# 'ఆరోగ్యాంధ్ర'.. సాధనే ముఖ్యమంత్రి లక్ష్యం!

## - నెల్లూరు ఎంపీ విపిఆర్



ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుతో కలిసి ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలో కేవీఎస్ఆర్ (కూనం వెంకటసుబ్బారెడ్డి) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలు ఎంతో అవసరమని ఆయన నిర్వాహకులను అభినందించారు. 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' ద్వారా పేదలకు వైద్యపరంగా పాతిక లక్షల రూపాయల వరకు లబ్ది చేకూర్చేందుకు ముఖ్యమంత్రి కార్యాచరణ చేపట్టారని విపిఆర్ తెలిపారు. పీపీపీ విధానంలో వైద్యకళాశాలల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నారన్నారు. అయితే, వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ పేరుతో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన విమర్శించారు. టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, వరంగల్ మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దీపమ్మ పుట్టినరోజు కానుకగా..

# దివ్యాంగులకి పౌష్టికాహారం





స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ.. భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడి కుమార్తె దీపా వెంకట్ (దీపమ్మ) తన పుట్టినరోజు సందర్భంగా సుమారు 150 మంది దివ్యాంగులు, వారి సంరక్షకులకి నిత్యం పౌష్టికాహారం అందజేసేందుకు నిర్ణయించారు. దీపమ్మ 51వ జన్మదినోత్సవం సందర్భంగా ఈనెల24న ఆమె నెల్లూరు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి పునరావాస మరియు సాధికారత సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం(కాంపోజిట్ రీజనల్ సెంటర్–సిఆర్‌సి)ని సందర్శించారు. ఆమె రాకను పురస్కరించుకుని సీఆర్‌సి సిబ్బంది ఆ కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటి దీపమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆ సమయంలో అక్కడి బాలల మానసిక స్థితిగతులు చూసి దీపమ్మ స్పందించారు. వారికి చేయూతనివ్వాలని సంకల్పించారు. ప్రత్యేకావసరాలున్న ఆ చిన్నారులకు రోజూ ఉపాహారం(బ్రేక్‌ఫాస్ట్)గా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించి ఆదుకోవాలని దీపమ్మ నిర్ణయించుకోవడం ఆ పేద పిల్లలకు, వారి తల్లితండ్రులకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఈ వితరణకు దీపమ్మ అల్లుడు కిషన్ గోవిందరాజు, కుమార్తె సుష్మా కిషన్ గోవిందరాజు, కుమారుడు విష్ణు ఇమ్మణ్ణి, కోడలు సాత్విక ఇమ్మణ్ణి సహకారం అందిస్తుండడం విశేషం. ఇప్పటికే ఇలాంటి పౌష్టికాహార వితరణ గత పది సంవత్సరాలుగా నిత్యం స్వర్ణభారత్ ట్రస్ట్‌లోని బ్రిడ్జిస్కూలు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఉన్న 150మంది పిల్లలకు కూడా అందజేస్తుండడం గమనార్హం. దేశంలో కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఇలాంటి సీఆర్‌సి కేంద్రాలు సుమారు 25 వరకు ఉంటే, వాటిలో ఈ ఒక్క కేంద్రంలోనే ఇలా నిత్యం ఉదయం వేళ అల్పాహార వితరణ జరుగుతుండడం విశేషం. అందులోనూ స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా వారి కుటుంబసభ్యులు ఈ వితరణకు దాతలుగా సహకరిస్తుండడం పట్ల ఆ సంస్థ నిర్వాహకులు, దివ్యాంగులైన చిన్నారులు, వారి సహాయకులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నెల్లూరు నగర కార్పొరేషన్...

# రోడ్డెక్కిన రాజకీయం!




**నెల్లూరు కార్పొరేషన్ మేయర్ పదవి మరోసారి వివాదంగా మారింది. మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారిన ఇరవై ఏళ్ళలో ఇప్పటివరకూ నలుగురు వ్యక్తులు మేయర్ పదవులని అలంకరించారు. అయితే, వారిలో అబ్దుల్ అజీజ్ ఒక్కరే పూర్తికాలం మేయర్‌గా పనిచేయడం గమనార్హం. అజీజ్ కూడా వైసీపీలో గెలిచి అనంతరం టీడీపీ అధికారంలోకి రావడంతో పార్టీ ఫిరాయించి తన పదవిని కాపాడుకున్నారు.**

ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో నెల్లూరు మునిసిపాలిటీ 2005లో కార్పొరేషన్‌గా అవతరించింది. నగర తొలి మేయర్‌గా పులిమి శైలజారెడ్డి ఆసనాన్ని అలంకరించారు. ఆ తరువాత చిత్ర విచిత్ర రాజకీయాలతో పులిమి శైలజని గద్దెదించి ఆ స్థానంలో నందిమండలం భానుశ్రీని అప్పటి నేతలు కూర్చోబెట్టారు. తొలి మేయర్‌గా 34నెలలు పులిమి శైలజ ఉండగా, ఆ తరువాత 16 నెలలు భానుశ్రీ ఆ బాధ్యతలు నిర్వహించారు. ఇద్దరు మహిళల తరువాత 2014లో మేయర్ పదవిని పొందిన అబ్దుల్ అజీజ్ అత్యంత లౌక్యంగా వ్యవహరించి అయిదేళ్ళ పాటు పూర్తికాలం మేయర్‌గా కొనసాగారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికలలో ఎవరూ ఊహించని స్థాయిలో మొత్తం ఉన్న 54స్థానాలూ వైసీపీ పరమయ్యాయి. మేయర్ పదవి ఎస్టీ జనరల్‌కి రిజర్వ్ కావడంతో ఆనాటి రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆశీస్సులతో పొట్లూరి స్రవంతి మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే, నగర అభివృద్ధిలో ఆమె పెద్దగా తన ప్రభావాన్ని చూపలేకపోయారు. ఆమె భర్త జయవర్ధన్ కార్పొరేషన్ వ్యవహారాలలో ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నాడన్న ఆరోపణలని ఎదుర్కొన్నారు. అనేక అంశాల్లో మేయర్ భర్త జయవర్ధన్ వివాదాస్పదంగా మారి రెండు పర్యాయాలు జైలుకి కూడా వెళ్లొచ్చారు. స్రవంతి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటినుండీ అనేక వివాదాలు ఆమె చుట్టూ తిరుగుతూనే ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలకి 16నెలల ముందే వైసీపీతో విభేదించి శ్రీధర్‌రెడ్డి తన అనుచర కార్పొరేటర్లతో ఆ పార్టీ నుండి బయటకి వచ్చేశారు. స్రవంతి మాత్రం వైసీపీలోనే కొనసాగారు. అప్పటి నుండి మేయర్ కుర్చీ వివాదాల చుట్టూ తిరుగుతోంది.

ఈ నేపథ్యంలో 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. మొత్తం 54 మంది కార్పొరేటర్లలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌తో సహా విడతల వారీగా 40 మంది పార్టీ మారిపోయారు. అయితే, నాలుగు సంవత్సరాల పాటు మేయర్‌పై అవిశ్వాసం పెట్టకూడదన్న నిబంధన ఉండడంతో, టీడీపీ నాయకులకి స్రవంతినే మేయర్‌గా కొనసాగించక తప్పలేదు. స్రవంతి పదవీకాలానికి నాలుగేళ్లు పూర్తి కావడంతో ఇప్పుడు టీడీపీకి అవకాశం వచ్చింది. ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. స్రవంతిని కుర్చీదించి తమ వాళ్ళని పీఠంపై కూర్చోబెట్టడానికి రంగం సిద్ధం చేశారు. మొత్తం 54మంది కార్పొరేటర్లలో ఎస్టీలు ముగ్గురే ఉన్నారు. స్రవంతి పోగా మిగిలిన ఇద్దరిలో ఒకరిని ఈ పదవి వరిస్తుందా... లేక డిప్యూటీ మేయర్ రూపకుమార్‌యాదవ్ ఇన్‌ఛార్జ్ మేయర్‌గా వ్యవహరిస్తారా...? అన్నది ఇప్పుడు జిల్లా రాజకీయ వర్గాలలో కొనసాగుతున్న చర్చ. మంత్రి నారాయణ, ఎం.పీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆశీస్సులతో పాటు కోటంరెడ్డి శ్రీధరరెడ్డితో, ఇతర టీడీపీ నాయకులతో రూప్‌కుమార్‌కి మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రూప్‌కుమార్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లుగా టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

### రోడ్డెక్కిన రాజకీయం!

సామాజిక మాధ్యమాల వేదికగా మేయర్ వివాదం రచ్చకెక్కింది. తమకి అన్యాయం చేశాడంటూ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తూ ప్రస్తుత మేయర్ స్రవంతి, ఆమె భర్త జయవర్ధన్ మీడియా ముందు నానా రాద్ధాంతం చేస్తున్నారు. శ్రీధరరెడ్డి శిష్య బృందం కూడా మేయర్ దంపతుల ఆరోపణలని ధీటుగా తిప్పికొడుతున్నారు. మొత్తం మీద మేయర్ వివాదం మరోసారి రచ్చకెక్కింది. అత్యంత వివాదాస్పదమైన ఆ మేయర్ కుర్చీ ఈసారి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి!

# నగరంలో ట్రాఫిక్ సిగ్నళ్ళు వచ్చేశాయి!

## వ్యవస్థ మారేనా.. ప్రజల అవస్థలు తీరేనా?

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అంటే నరకమే. నిద్రపోయే పసిపిల్లోడిని తట్టిలేపి అడిగినా ఈ విషయం ఒప్పుకుంటాడు. పెరుగుతున్న నగరం, అందుకు తగ్గట్లుగా జనం, దానికి అనుగుణంగా వాహనాలు.. ఇదీ ఎప్పటికప్పుడు మారుతున్న నెల్లూరు నగర స్వరూపం. అందుకు తగ్గట్లుగా రోడ్లు లేవు, రోడ్ల విస్తరణలేదు. కొన్ని దశాబ్దాల తరువాత మళ్ళీ ఇన్నాళ్ళకి నగర పోలీసుశాఖ నగరంలోని కొన్ని ప్రధాన కూడళ్ళయిన రామలింగాపురం, హరనాథపురం, వి.ఆర్.కాలేజీ, కనకమహల్, కే.వీ.ఆర్. పెట్రోల్ బంక్, మద్రాసు బస్టాండు, డీ.కే.డబ్ల్యూ కళాశాల ప్రాంతాలలో ట్రాఫిక్ సిగ్నెళ్ళని ఏర్పాటు చేసింది. మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, రూరల్ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు అధికార యంత్రాంగంతో కలసి ఈ సిగ్నెల్ వ్యవస్థకి ప్రారంభోత్సవం చేశారు. ఈ సిగ్నెళ్ళ ఏర్పాటుకోసం 1.39కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, నగర ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించి ఈ సిగ్నెల్ వ్యవస్థని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.


ఎర్రలైటు వెలుగుతున్నా.. దూసుకుపోతున్న ఆటోవాలా

అంతా బాగానే వుంది... మరి పోలీసువారు వాళ్ళు చేయాల్సిన డ్యూటీ సక్రమంగా చేస్తున్నారా...? ట్రాఫిక్ నియంత్రణలో చిత్తశుద్ధి చూపిస్తున్నారా...? అస్తవ్యస్తమైన పార్కింగ్ వ్యవస్థని చక్కదిద్దగలుగుతున్నారా...? రాంగ్ పార్కింగులని ప్రశ్నించగలుగుతున్నారా..? రాష్‌డ్రైవింగుని అదుపు చేయగలుగుతున్నారా..? ట్రిపుల్ రైడింగుని ఆపగలుగుతున్నారా...? వన్‌వేలలో వచ్చే వాహనదారులని పట్టుకో గలుగుతున్నారా...? ఆటోవాలాల ఆగడాలని అడ్డుకోగలుగుతున్నారా...? సిటీ బస్సుల అధిపత్యానికి చెక్ పెట్టగలుగుతున్నారా...? రోడ్లని ఆక్రమించి అంగళ్ళు పెట్టేసుకుని ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్న దురాక్రమణలని తొలగించగలుగుతున్నారా...? అంటే.. లేదు అనే సమాధానమే పురపౌరులనుండి ముక్తకంఠంతో వినిపిస్తోంది.

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ట్రాఫిక్ పోలీసులు డమ్మీలుగా మారిపోయారు. వాళ్ళంతా యూనిఫారం వేసుకున్న దిష్టి బొమ్మలలాగా తయారయ్యారు. నెలసరి టార్గెట్ల కోసం తప్పుడు ఫైన్లని విధించి, బలవంతపు వసూళ్లు చేస్తున్నారు. ఆర్సీ బుక్కులు, లైసెన్సులు చెకింగులు అంటూ ద్విచక్ర వాహనదారులని భయపెడుతున్నారు. ఇవీ ట్రాఫిక్ పోలీసులపై నగరవాసుల నుండి వ్యక్తమవుతున్న అభిప్రాయాలు. ఇలాంటి తరుణంలో ఇప్పుడు కొత్తగా ట్రాఫిక్ సిగ్నెళ్ళు అవతరించాయి. ఈ సిగ్నెల్స్ పనిచేయడం ప్రారంభించి వారం కావస్తున్నా ప్రజలలో మాత్రం మార్పు రాలేదు. ఒక్క పోలీసు కార్యాలయం (డి.కే.డబ్ల్యూ కళాశాల) కూడలి వద్ద తప్ప మిగిలిన చోట్ల రెడ్‌లైట్ వెలిగినా వాహనాలు వెళ్లిపోతూనే వున్నాయి. పోలీసులు బాతాఖానీ వేసుకుంటూ చోద్యం చూస్తున్నారు. చాన్నాళ్ళ తరువాత మళ్ళీ కొత్తగా వచ్చిన ఈ సిగ్నెల్ వ్యవస్థ నెల్లూరు ట్రాఫిక్ వ్యవస్థని, ప్రజల అవస్థలని ఏ మాత్రం ప్రభావితం చేస్తాయో వేచి చూడాలి!

# పేరంటాలమ్మ దేవాలయానికి పూర్వ వైభవం!

## 1.15 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రులు, ఎంపీ



నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ వెంకటమ్మ పేరంటాలమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి పురపాలక మంత్రి డా. పొంగూరు నారాయణ ఇటీవల భూమిపూజ చేశారు. దాదాపు 1.15 కోట్ల రూపాయలతో ఆ ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. దీంతో ఆ ఆలయానికి త్వరలోనే మహర్దశ రానుంది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, పేరంటాలమ్మ దేవాలయంలో మూడంతస్థుల రాజగోపురం, మహామండపం, అర్చకస్వామి నివాసం, కార్యాలయ నిర్మాణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఈ ఆలయ అభివృద్ధితో పాటు, నెల్లూరు నగర నియోజకవర్గంలో నాలుగు దేవాలయాల అభివృద్ధికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి 23.95 కోట్లు కేటాయించారంటూ సంతోషం వ్యక్తం చేశారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేతలు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆనం రంగమయూర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీపీఓగా వసుమతి



జిల్లా పంచాయతీ శాఖ అధికారిణి (డీపీఓ)గా నెల్లూరు డీఎల్‌డీఓగా పనిచేస్తున్న వసుమతి నియమితులయ్యారు. ఈనెల 24న ఆమె డీపీఓగా నెల్లూరులోని తమ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి వరకు డీపీఓగా పనిచేస్తున్న ఎల్.శ్రీధర్‌రెడ్డి జడ్పీ సీఇఓగా నియమితులు కావడంతో, ఆ స్థానంలో వసుమతిని నియమించారు.

## రోడ్లు, భవనాలశాఖకి..కొత్త ఎస్ఇ

రోడ్లు భవనాల శాఖ ఎస్ఇగా బాపట్లలో ఆ శాఖ ఇఇగా పనిచేస్తున్న ప్రసాద్‌రావును ప్రభుత్వం నెల్లూరులో నియమిస్తూ ఈనెల 25న ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడ త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

## న్యాయ విజ్ఞాన సదస్సు

నెల్లూరులోని డీకేడబ్ల్యు కళాశాలలో ఈనెల 24న న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆ సంస్థ జిల్లా కార్యదర్శి..సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి మాట్లాడుతూ, చట్టాల పట్ల అవగాహన కల్పించుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా జరిగిన ఈ సదస్సులో, మహిళలపై జరుగుతున్న హింసలను వివరిస్తూ, వాటిని న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలో అవగాహన కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

## శ్రీ సత్యసాయికి..

## వేమిరెడ్డి దంపతుల పుష్పాంజలి



భగవాన్ శ్రీ సత్య సాయి బోధనలు దేశ, విదేశాల్లోని లక్షలాది మందికి సన్మార్గం చూపాయని, వారి మానవతా సేవలు సాటిలేనివని వేమిరెడ్డి దంపతులు చెప్పారు. శ్రీ సత్య సాయిబాబా శత జయంతిని పురస్కరించుకొని ఇటీవల నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని వారి నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు బాబా చిత్ర పటానికి పూలమాల వేసి పుష్పాంజలి అర్పించారు.

## సీపీఎం నేతతో.. సోమిరెడ్డి భేటీ



ఇటీవల నెల్లూరు పర్యటనకు విచ్చేసిన సీపీఎం జాతీయ నాయకులు బీవీ రాఘవులుతో టీడీపీ నేత.. మాజీమంత్రి.. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. బాలాజీనగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో బీవీని మర్యాదపూర్వకంగా కలుసుకోవడంతో, ఇరువురు నేతలు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. సోమిరెడ్డికి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభం నుంచి వామపక్ష పార్టీలతో ప్రత్యేక అనుబంధం కలిగివుండడంతో, ఆయన్ను వామపక్షాల పార్టీల నాయకులు ఓ సోదరునిలా ఆదరిస్తున్న విషయం తెలిసిందే. గతంలో వామపక్ష పార్టీలతో కలిసి సోమిరెడ్డి అనేక ఐక్య ఉద్యమాలకు నాయకత్వం వహించారు కూడా. ఈ నేపథ్యంలో బీవీ రాఘవులుతో పలు ఉద్యమాలు, ప్రజా పోరాటాలకు సంబంధించి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

## మాగుంట సేవలు మార్గదర్శకం



జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో ఈనెల 26న మాజీ ఎంపీ, దివంగత నేత స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతి జరిగింది. ఈ సందర్భంగా మాగుంట చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మాగుంట సుబ్బరామిరెడ్డి సేవా కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నేటి తరం నాయకులకు ఆయన ఆదర్శమని చెప్పారు. రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ చామర్తి జనార్దన్‌రాజు, స్పాస్టిక్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్, యడవలి సురేష్, సెక్రెటరీ పి.మస్తానయ్య, మాజీ రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, మాగుంట కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ దినోత్సవం

నెల్లూరులోని 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదన్గవే కమాండింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు, స్థానిక వెంగళరావునగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో, ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఈనెల 25న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్‌సిసి క్యాడెట్లకి నరేంద్రబాబు రాజ్యాంగ దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. తొలుత, డా. బి.ఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని సి.మంజులవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గిన్నిస్ బుక్‌లో 'విశ్వసాయి' విద్యార్థి



నెల్లూరు, విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థి పి.వెంకట జ్యోతిరెడ్డి గిన్నిస్ బుక్ రికార్డు సాధించాడు. ఇటీవల కర్ణాటక రాష్ట్రం బెల్గాంలో నిర్వహించిన వేగవంతమైన 100 మీటర్ల రోలర్‌స్కేటింగ్‌ను వెనుకనుండి నడుపుతూ 14.84 సెకన్లలో పూర్తిచేసి జ్యోతిరెడ్డి గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఇటీవల కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల ఛైర్మన్ డా॥ యన్.సత్యనారాయణ, డైరెక్టర్ శివసంకేత్‌లు పి.వి.జ్యోతిరెడ్డిని పుష్పగుచ్ఛంతో అభినందించి ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ జ్యోతిరెడ్డి అక్టోబర్ 11, 12 తేదీలలో జరిగిన అండర్-18 జూనియర్ బాలుర నెల్లూరు డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 3వ స్థానం, 2024లో గుంటూరులో జరిగిన డెకత్లాన్ ప్లేలో గోల్డ్‌మెడల్ సాధించాడని తెలుపుతూ, విశ్వసాయి కేవలం చదువులలోనే కాదు, క్రీడలకూ ప్రోత్సాహం ఇస్తుందని పేర్కొన్నారు.

## చేపపిల్లలు..చెరువులోకి విడుదల



నెల్లూరులోని స్వర్ణాల చెరువులో ఈ నెల 25న 5 లక్షల చేపపిల్లలను చెరువులోకి వదిలారు. ప్రధానమంత్రి మత్స్య యోజనలో భాగంగా మీనోత్సవాన్ని పురస్కరించుకుని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేపపిల్లలను చెరువులోకి వదిలారు. ఈ ఏడాది చెరువులో 13లక్షల చేపలను వదిలేందుకు కృషి జరుగుతోందని, దీనివల్ల వందలాదిమంది మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి కలుగుతుందని అన్నారు. నెల్లూరు ఆర్డీఓ అనూష, మాజీ మేయర్ భానుశ్రీ, మత్స్యశాఖ జేడీ శాంతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై హింస..పెరుగుతూనే ఉంది

దేశంలో మహిళలపై హింస పెరుగుతూనే ఉందని, ఎక్కడో ఒకచోట నిత్యం మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవంబరు 25..అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నెల్లూరులో 'ఐద్వా' ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, మహిళలు మాట్లాడారు. ప్రతి పది నిమిషాలకి ఒక మహిళ హత్యకు గురవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు డిజిటల్ హింసకు గురవుతున్నారన్నారు. బాలికలు, స్త్రీలు, మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలను నిరోధించేందుకు ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్రాంత అధ్యాపకురాలు భారతి, ఐద్వా నాయకురాళ్ళు షేక్ మస్తాన్‌బీ, పద్మ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ నాయకుల అభినందన



ఇటీవల అనంతపురంలో జరిగిన 8వ రెవెన్యూ క్రీడల్లో జిల్లాకి చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్నారు. వారికి ఈనెల 23న నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానాలు జరిగాయి. ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి వారిని అభినందించి, రన్నింగ్ షూస్ బహుకరించారు. జిల్లా సంఘం ప్రతినిధులు డేనియల్ పీటర్ రావు, గోపీకృష్ణ, సతీష్, బాలకోటమ్మ, భాగ్యలక్ష్మి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పాత వెల్లంటిలో.. 'చంద్రన్న విద్యుత్ వెలుగులు'



**• ప్రారంభించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో సైతం విద్యుత్ వెలుగులు ప్రసరింపజేస్తామన్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అందుకు తగ్గట్టుగా కృషిచేస్తున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పాత వెల్లంటి గ్రామంలో ఆయన ఇటీవల 'చంద్రన్న విద్యుత్ వెలుగులు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ నియోజకవర్గంలోని మొత్తం 26 ప్రాంతాలలో త్రీ–ఫేజ్ కరెంటు పనులు జరుగుతున్నాయని, వాటిలో 20 ప్రాంతాలలో పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 6 ప్రాంతాలలో కూడా పనులు పూర్తయి, ఛార్జింగ్ దశలో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, యువనేత – మంత్రి నారా లోకేష్ నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్నారంటూ వారికి నెల్లూరు రూరల్ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్‌కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, నీటి సంఘం అధ్యక్షుడు మురళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రిని కలసిన కాకర్ల

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ – ప్రవీణ దంపతులు ఈనెల 25న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గౌరవపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉదయగిరికి సంబంధించి సాగునీటి సమస్య, తాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పన, పార్టీ సంస్థాగత బలోపేతం తదితర విషయాలపై కాకర్ల ముఖ్యమంత్రితో చర్చించారు.

# సేవోత్సవంగా.. ఆమె జన్మదినోత్సవం

*నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు.. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినోత్సవం.. ఒక సేవోత్సవంగా జరిగింది. విపిఆర్ దంపతుల అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమక్షంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆనందసందోహాల మధ్య ఈ వేడుకలు జరుపుకున్నారు. ప్రశాంతమ్మకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విపిఆర్ దంపతులు చేస్తున్న సేవాకార్యక్రమాలను కొనియాడుతూ, అనేకమంది నాయకులు కార్యకర్తలు తమ ప్రాంతాల్లో ఆరోజున చెట్లు నాటడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరిగింది. ఆర్భాటాలకు దూరంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్న ప్రశాంతమ్మ పిలుపుకి అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు ఆ బాటలోనే పయనించారు. ఆమె కూడా హైదరాబాదులో ఉండి, స్వయంగా పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.*

## బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సిబ్బందికి ప్రశాంతమ్మ వస్త్రదానం




తన పుట్టినరోజును పురస్కరించుకుని ఈ నెల 22న హైదరాబాద్‌లో క్యాన్సర్ బాధితులకు సేవలందిస్తున్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సిబ్బంది మొత్తానికీ ప్రశాంతమ్మ నూతన వస్త్రాలను అందించారు. నిత్యం క్యాన్సర్ పేషంట్లకు అలు పెరగకుండా ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి ఆమె అండగా నిలిచారు. ఎంతో ఉన్నత ఆశయంతో నిర్వాహకులు ఈ ఆసుపత్రిని తీర్చిదిద్దారని ఆమె కొనియాడారు. అంతకుముందు జూబ్లీ హిల్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీవారి ఆశీస్సులు అందుకున్నారు. షిరిడి సాయినాధుని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వాదం పొందారు.

### నెల్లూరు టీడీపీ కార్యాలయంలో :



నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రశాంతమ్మ పుట్టినరోజు వేడుకల్లో టీడీపీ నాయకుడు చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ప్రశాంతమ్మకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంతమ్మ కోవూరు నియోజకవర్గానికి చేస్తున్న సేవలను ఆయన ప్రస్తుతించారు.

### పలుచోట్ల రక్తదాన శిబిరాలు



ప్రశాంతమ్మ పుట్టినరోజు నాడు కోవూరులోని టీడీపీ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. కోవూరులోని పివిఆర్ కళ్యాణ మండపంలో టీడీపీ మాజీ మండలాధ్యక్షులు మరియు తెలుగుయువత ఆధ్వర్యంలో మెడికవర్, జయభారత్ హాస్పిటల్స్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు, 130 మంది రక్తదానం చేశారు. బుచ్చి పట్టణంలో 125 మంది, ఇందుకూరుపేటలో 150మంది, కొడవలూరులో 170మంది, కోవూరు సమీపంలోని ఇనమడుగులో 150మంది, విడవలూరులో 106 మంది రక్తదానం చేశారు. మైపాడు తీరంలో సీనియర్ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి ప్రశాంతమ్మకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థినీవిద్యార్థుల పరీక్ష ఫీజులకు సంబంధించి 2 లక్షల 96 వేల రూపాయలను టీడీపీ సీనియర్ నాయకుడు కోదూరు కమలాకర్‌రెడ్డి మండల విద్యాశాఖ అధికారులకు అందజేశారు.

### పర్యావరణ హితం.. ప్రశాంతమ్మ జన్మదినం



ప్రశాంతమ్మ జన్మదినం వందల మొక్కలకు ఊపిరినిచ్చింది. పర్యావరణ పరిరక్షణకు బాసటగా నిలిచింది. తన జన్మదిన వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలని, మొక్కలు నాటాలని ప్రశాంతమ్మ ఇచ్చిన పిలుపుతో నాయకులు, కార్యకర్తలు కోవూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తృతంగా మొక్కలు నాటి ప్రశాంతమ్మ ఆశయానికి ఊపిరిపోశారు.

# ఆదర్శనీయులు.. వెంకయ్య, సోమిరెడ్డి!

**• వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్**



ప్రజల కోసం ఎలా పనిచేయాలనేందుకు పూర్వ ఉపరాష్ట్రపతి.. పెద్దాయన వెంకయ్య నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లాంటి ఆదర్శప్రాయులైన నాయకులు తనకు మార్గదర్శకమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ చెప్పారు. ఇటీవల ఆయన సర్వేపల్లి నియోజకవర్గంలోని మనుబోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రిగా తాను రెండోసారి సర్వేపల్లి నియోజకవర్గంలో పర్యటిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. పొదలకూరు ప్రాంత ప్రజలకు డయాలసిస్ సెంటర్ కేటాయించాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పట్టుపట్టారన్నారు. ఏదైనా ఒక పనిచేయాలనుకుంటే అది అయ్యేవరకు సోమిరెడ్డి నిద్రపోరని ఆయన అన్నారు. ప్రభుత్వం 5 పడకలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తే, అక్కడితో ఊరుకోకుండా సీఎస్ఆర్ నిధులతో మరో 3 బెడ్లు ఆయన అందుబాటులోకి తెచ్చారన్నారు. ప్రభుత్వ నిధులు సాధించుకోవడంతో పాటు, సీఎస్ఆర్ నిధులు కూడా తెచ్చుకుంటున్నారని ఆయన సోమిరెడ్డి పనితీరును కొనియాడారు. ప్రజల కోసం నిరంతరం తపించే నాయకుడు సోమిరెడ్డి అని ఆయన కితాబిచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని 35 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ. 13.75కోట్లు మంజూరు చేశామని, అదేవిధంగా, ముత్తుకూరులో రూ. 1.95 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు.

### పిలవగానే పలికే నాయకుడు సత్య - సోమిరెడ్డి

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, పిలవగానే పలికే నాయకుడు సత్యకుమార్ అని, ఆయన వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉండడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని అన్నారు. సత్యకుమార్ సహకారంతో పొదలకూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నామని, దీనిని 5 మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.




# మార్చిలోగా పేదలకు టిడ్కో ఇళ్ళు



ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మార్చిలోగా టిడ్కో ఇళ్లను పూర్తిచేయించి ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలక మంత్రి డా. పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర కార్పొరేషన్, నుడా అధికారులతో మంత్రి సమావేశమై, టిడ్కో ఇళ్ళ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 43వేల టిడ్కో ఇళ్లను మార్చి లోపు సిద్ధం చేస్తామన్నారు. అర్హత ఉన్న వాళ్ళు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు జరగనున్నాయని తెలిపారు. నెల్లూరును ముంపునుంచి తప్పించాలంటే కాలువలపై ఆక్రమణలు తొలగించాలని, అందుకు ఆక్రమణదారులు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావ్య క్రిష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కమిషనర్ నందన్, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్‌లో
# సంవిధాన దినోత్సవం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టీలో ఈనెల 26న సంవిధాన దినోత్సవం జరిగింది. భారత రాజ్యాంగకర్త డా.బీఆర్ అంబేద్కర్‌ను స్మరించుకుంటూ, రాజ్యాంగ విలువలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎం.శ్రీనివాసులు, మేనేజ్‌మెంట్ సైన్స్ విభాగాధిపతి డా. బి.వాసవి, డీన్స్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డా. సి ఉదయకుమార్‌రాజు, డా. వి. హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆరున్నర కోట్లతో..
# ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం

జిల్లాలోని ప్రసిద్ధమైన పెంచలకోన క్షేత్రంలో కొలువైవున్న శ్రీ ఆదిలక్ష్మీదేవి అమ్మవారి కోవెలను 6.50కోట్ల రూపాయల వ్యయంతో పునర్నిర్మాణం గావించనున్నారు. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈనెల 23న పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వెంకటగిరి నియోజకవర్గంలోనూ పలు ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. వెంకటగిరి పోలేరమ్మ జాతరలో ధ్యానమందిరానికి, బాలాయపల్లి మండలంలో యాచవరం ఆలయానికి నిధులిచ్చామన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 141 ఆలయాలకు ఒక్కొక్క ఆలయానికి ధూపదీప నైవేద్యాలకు ప్రతినెలా 10వేల రూపాయల వంతున అందజేస్తున్నామన్నారు. సిజిఎఫ్ఎస్ ద్వారా 58 ఆలయాల అభివృద్ధి పనులకు 118.45 కోట్లు నిధులిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 'రైతన్నా.. మీకోసం' మేమున్నాం!

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి భరోసా



రైతన్నా, మీ అభ్యున్నతి కోసం మేమున్నామంటూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భరోసా ఇచ్చారు. ఇటీవల విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో పొలంగట్లపై నిర్వహించిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, కూటమి ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న వ్యవసాయ సంక్షేమ విధానాలను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎప్పటికప్పుడు సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. చిన్న, సన్నకారు రైతుల కోసమే యూరియా కార్డుల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. రైతులకు ఇప్పటికే రెండు విడతల యూరియా ఎరువును పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరికైనా అన్నదాత సుఖీభవ పథకం ప్రయోజనాలు అందకుంటే వెంటనే సచివాలయాల్లో తెలియజేయాలన్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఆధునిక యంత్ర పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని, ఆధునిక పద్ధతుల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించాలన్నారు.

## ఆత్మకూరులో అభయాంజనేయస్వామికి మంత్రి పూజలు



ఆత్మకూరు మినీ బైపాస్‌రోడ్డు వద్దనున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల పూజలు చేశారు. ఈ ఆలయ కమిటీకి వంశపారంపర్య అధ్యక్షునిగా ఉన్న రవీంద్రారెడ్డికి ఆలయ అభివృద్ధి బాధ్యతలను అప్పగిస్తున్నామని మంత్రి తెలిపారు. త్వరలోనే ఆలయ పాలకమండలి సభ్యులని నియమించాలని జిల్లా దేవాదాయశాఖ అధికారిని ఆదేశిస్తామన్నారు. ఈ ఆలయ అభివృద్ధికి తాము అన్నివిధాల సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ధర్మరాజుల స్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం



గూడూరులోని ధర్మరాజుల స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఇటీవల ఆలయ ప్రాంగణంలో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ ఈవో సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్‌గా వాటంబేడు శివకుమార్, సభ్యులుగా సుజాత, వై.విజయ, కేశవర్ధన్‌రావు, శాంతి, ఏ.విజయ, మౌనిక, సుబ్బరత్న, జయమ్మ, మాధవ, లక్ష్మణ్‌రావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చదలవాడ హరిప్రసాద్, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బాలకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా బీఎస్పీ పోరాటం



పేదల సమస్యల పరిష్కారం కోసం బీఎస్పీ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ నాయకుడు నాశిన భాస్కర్‌గౌడ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని తపాలా కార్యాలయం ముందు అంబేద్కర్ విగ్రహం వద్ద భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరాజు, వేమయ్య, పుల్లయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# చెకుముకి విజేతలు చెన్నూరు విద్యార్థులు



జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరుపతి సైన్స్ సెంటర్లో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలలో చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తరుణ్, ఆదిత్య, వహీద్ అహ్మద్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. దీంతో, గూడూరు జనవిజ్ఞాన వేదిక సభ్యులు చెన్నూరులోని బాలుర పాఠశాలకి వెళ్లి వారికి బహుమతులు ప్రదానం చేసి, అభినందించారు. రాష్ట్రస్థాయి పరీక్షల్లో కూడా బాగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మొదటి బహుమతి సాధించేలా కృషిచేసిన సైన్స్ టీచర్లను ఈ సందర్భంగా జేవీవీ సభ్యులు సన్మానించారు. జే.వి.వి గౌరవ అధ్యక్షుడు పురుషోత్తమరావు, ఉపాధ్యక్షులు చెంచు నారాయణ, నాగరాజు, ప్రభాకర్, స్కూల్ హెచ్ఎం బాలనాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యలు తీర్చండి



దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలంటూ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా మోహన్ ఇటీవల సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎల్వీ జిల్లా స్థాయి దివ్యాంగ నాయకులు జిల్లా అధికారులతో తమ సమస్యల పరిష్కారానికై సమీక్షా సమావేశం నిర్వహించాలని, దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.



# నేత్రపర్వం.. సాయి సత్యవ్రతం

సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా గూడూరు, కుమ్మరివీధిలోని శ్రీ సత్యసాయి ప్రేమసుధా మందిరంలో సత్యసాయిబాబా వారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నగరోత్సవం, సాయి సత్యవ్రతం ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

# రెడ్డి సంఘం పలసరుకుల పంపిణీ



గూడూరులోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 23వ తేదీ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 45 మంది వృద్ధులకు నెలకు సరిపడా పలసరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించిన డా. జనార్దన్‌రెడ్డి, డా. రోహిణి, గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డిలకు రెడ్డి సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. సనత్ కుమార్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మండి శ్రీనివాసరెడ్డి, యరమాక కృష్ణారెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సత్యసాయిని స్మరించుకున్న అధికారులు



భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 23వ తేదీ నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పలువురు అధికారులు, బాబా భక్తులు సాయి సేవలను స్మరించుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు శ్రీ సత్యసాయిబాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. శతజయంతి వేడుకల పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ మహనీయుని మానవీయ సందేశాలు కోట్లాదిమంది భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలచివున్నాయని కొనియాడారు. సత్యసాయిబాబా తన సేవలతో మారుమూల గ్రామమైన పుట్టపర్తికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని, రాయలసీమ ప్రజల దాహార్తి తీర్చారని, పేదలకు ఉచిత విద్యనందించి సేవాదీప్తిగా పేరొందారని అన్నారు. బాబా స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సమాజ సేవ చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు.

# వెలుగువాకిళ్లు తెరుస్తున్న.. 'విపిఆర్ నేత్ర'

## వరికుంటపాడులో 3617 మందికి ఉచిత కంటిపరీక్షలు



కంటి చూపు బాగాలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు 'విపిఆర్ నేత్ర' ఒక వరమైంది. ప్రజలకు కంటి పరీక్షలు చేసి, వారి కంటిచూపు మెరుగుపరిచేందుకు సేవాభూషణులు..నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి..ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు చేపట్టిన 'విపిఆర్ నేత్ర' కార్యక్రమాన్ని వేలాదిగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు వినియోగించుకుంటున్నారు. అందుకు అన్ని ఏర్పాట్లతో, వైద్యబృందంతో కూడిన ఒక బస్సును కూడా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నవంబర్ 3న ప్రారంభించిన ఈ కార్యక్రమం... ఈనెల 22వ తేదీకి జిల్లాలోని వరికుంటపాడు మండలంలో 18 పంచాయతీల్లో 3617 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం విశేషం! ఉచితంగా కంటిపరీక్షలు చేయడమే కాక, 2096 మందికి కంటి అద్దాలు కూడా ఉచితంగానే అందించి వేమిరెడ్డి దంపతులు తమ ఔదార్యం చాటుకున్నారు. కంటిచూపు మందగించిన వారికి వెలుగు వాకిళ్ళు తెరుస్తూ ఈ కార్యక్రమం ముందుకు సాగిపోతోందని, ప్రజల నుంచి మంచి స్పందన కూడా ఉంటోందని నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## గిరిజనుల దేవుడయ్య..

# వెన్నెలకంటి రాఘవయ్య



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల దేవుడుగా పేరొందిన వెన్నెల కంటి రాఘవయ్య సేవలు అపారమని ఆదిమజాతి సేవా సంఘాల నాయకులు కొని యాడారు. ఈనెల 24న వెన్నెలకంటి రాఘవయ్య వర్ధంతి సందర్భంగా, నెల్లూరు లోని వెన్నెలకంటి భవన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. గిరిజనుల సంక్షేమం, అభ్యున్నతి కోసం వెన్నెలకంటి రాఘవయ్య జీవితాంతం కృషి చేశారని, అందుకే ఆయన గిరిజనులు, ఆదిమజాతుల వారికి దేవుడయ్యాడని కీర్తించారు. ఏపీ ఆదిమజాతి సేవాసంఘం ట్రస్ట్ బోర్డు ట్రస్టీ పీఎల్ ప్రసాద్, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, ట్రస్ట్‌బోర్డు సభ్యులు రాజేశ్వరమ్మ, పి.లావణ్య, గంధళ్ళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ బుడగ పేలుతుందా?




ఇది కృత్రిమ మేధ(ఏఐ) యుగం. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే ఏఐ సాధనాలతో ఏదైనా సృష్టించొచ్చు. ఏఐతోనే సినిమాలూ తీయొచ్చు. నటీనటులు అవసరం లేకుండానే వారికి రూపం ఇచ్చి అద్భుతమైన సినిమాలు రూపొందించవచ్చు. ఏఐ సాయంతో ట్రాఫిక్‌ను నియంత్రించొచ్చు. ఇలా చెప్పుకుంటూ వెళితే ఏఐ ప్రవేశించని రంగం లేదు. అయితే ఈ ఏఐ భవిష్యత్తు ఏమిటి? అది సుస్థిరంగా ఉంటుందా? లేదా ఒక బుడగలా పేలిపోతుందా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ప్రపంచంలో సాంకేతిక విప్లవాలు కొత్తేమీ కాదు. ఇంటర్నెట్ (1990లు), మొబైల్ (2000లు) వచ్చినట్లే.. ఇప్పుడు కృత్రిమ మేధస్సు(ఏఐ) వచ్చింది. అయితే, కేవలం రెండేళ్లలో బిలియన్ల డాలర్ల కొద్దీ పెట్టుబడులు, ఆకాశాన్నంటిన స్టాక్ మార్కెట్ విలువలతో ఏఐ రంగంపై విపరీతమైన 'హైప్' నెలకొంది. ఈ వృద్ధి నిజమైన ప్రగతికి నిదర్శనమా, లేక 2000 నాటి డాట్-కామ్ బబుల్ తరహాలో పేలబోయే ఒక 'బుడగ' కు సంకేతమా? ఈ కీలకమైన ప్రశ్నపై ప్రపంచ ఆర్థిక వేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు భిన్న విశ్లేషణలు చేస్తున్నారు. ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు రుచిర్‌శర్మ ప్రస్తుత ఏఐ మార్కెట్‌ను అత్యంత సూక్ష్మంగా విశ్లేషించారు. ఆర్థికంగా బుడగ పేలడానికి సంకేతాలైన నాలుగు అంశాలు-అధిక మదింపు(Over valuation), అధిక పెట్టుబడి, పెద్ద సంఖ్యలో రుణాలు, మితిమీరిన యాజమాన్యం ఏఐ మార్కెట్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయని శర్మ హెచ్చరించారు. ఈ స్టాక్ మార్కెట్ విలువలు 1929 నాటి మహా మాంద్యం, 1999 నాటి డాట్-కామ్ పతనానికి ముందు ఉన్న స్థాయిలకు సమానంగా ఉన్నాయని విశ్లేషించారు. అయితే, బుడగ ఎప్పుడు పేలుతుందో కచ్చితంగా చెప్పడం అసాధ్యమని ఆయన అన్నారు. పెట్టుబడి దారులకు నగదు కొరత వచ్చినప్పుడు లేదా అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచినప్పుడు మాత్రమే ఈ బుడగ పగిలే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

రుచిర్‌శర్మ మార్కెట్ విలువపై దృష్టి సారించగా, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల దృష్టి విలువ సృష్టిపై ఉంది. కేవలం పెట్టుబడులు పెరగడం ముఖ్యం కాదని, ఏఐ యుగంలో కంపెనీలు తమ ఆర్థిక సూత్రాలను పునరాలోచించుకోవాలని నాదెళ్ల సూచించారు.ఏఐ అనేది కేవలం టెక్ కంపెనీల కోసమే పనిచేయకూడ దన్నది ఆయన అభిప్రాయం. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే ఏఐని వినియోగిస్తున్న కంపెనీల మొత్తం విలువ కన్నా ఏఐని అభివృద్ధి చేసి ఇస్తున్న కంపెనీల విలువ చాలా అధికంగా ఉందని, ఇది సరికాదని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ అసమానత కొనసాగితే అసలుకే మోసం వస్తుందని హెచ్చరించారు. అంటే, ఏఐ వల్ల కేవలం దాన్ని అభివృద్ధి చేసిన కంపెనీ మాత్రమే లాభపడకూడదని, వినియోగదారులు, స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తలు కూడా దాని ద్వారా పెద్దఎత్తున ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలను పొందాలని అన్నారు.

నాదెళ్ల మాటల్లో చెప్పాలంటే, ఏఐ నిజమైన విలువ ఆకాశాన్నంటే మదింపులో కాదు, నిజ-ప్రపంచ మార్పులో ఉంది. "ఫార్మాస్యూటికల్ కంపెనీలు 12ఏళ్ల బదులు ఒక్క సంవత్సరంలో కొత్త చికిత్సలను మార్కెట్‌లోకి తీసుకురావడం లేదా రైతులు పంట నష్టాలను నివారించడం వంటి మార్పులలోనే అసలైన విజయం ఉంటుంది." అని ఆయన అన్నారు.

ఆర్థిక విశ్లేషకులు బుడగ పేలుతుందా లేదా అనేదానిపై తర్జనభర్జన పడుతుంటే, మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా మరో కోణాన్ని స్పృశించారు. ఏఐ వల్ల ఉద్యోగాల కోతపై వస్తున్న భయాల కంటే మరింత పెద్ద సంక్షోభం పొంచి ఉందని హెచ్చరించారు. ఆ సంక్షోభం - నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత. అంటే ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు వంటి వృత్తి నిపుణుల కొరత.

వైట్‌కాలర్ ఉద్యోగాలు, ముఖ్యంగా డెస్క్ పనులు ఏఐ కారణంగా తుడిచిపెట్టుకు పోతాయనడంలో సందేహం లేదు. కానీ, నిజ జీవితంలో అవసరమయ్యే నైపుణ్యంతో కూడిన పనులు, నిర్మాణాత్మక పనులు ఏఐ చేయలేదు.

మహీంద్రా చెప్పినదాని ప్రకారం, దశాబ్దాలుగా మనం డిగ్రీలను, డెస్క్ జాబ్‌లను గొప్పగా చూసి, ఈ ట్రేడ్ నైపుణ్యాలను చిన్నచూపు చూశాం. దీని ఫలితంగా, ఈ రంగాలలో ఇప్పుడు భారీ కొరత ఏర్పడింది. ఏఐ యుగంలో ప్రపంచాన్ని నిర్మించ గలిగే, మరమ్మతు చేయగలిగే నైపుణ్యం కలిగిన కార్మికులే అత్యంత విలువైనవారిగా, అతిపెద్ద విజేతలుగా నిలబడతారని ఆయన బలంగా నొక్కి చెప్పారు. ఆయన విశ్లేషణలో చాలా వాస్తవం దాగి ఉంది. అమెరికాలో ఇటువంటి నైపుణ్యం కలిగిన కార్మికుల కొరతను అక్కడి సంస్థలు ఇప్పటికే అనుభవిస్తున్నాయి. మన దేశంలోని నైపుణ్యవంతులకు గల్ఫ్ దేశాల్లో డిమాండ్ అందుకే. వారికి తగిన వేతనం చెల్లిస్తు న్నారా లేదా అన్నది వేరే అంశం. వాస్తవానికి భవిష్యత్తులో వారికే మంచి వేతనాలు లభించే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో ఏఐ బుడగ పేలుతుందా? అనేది అంచనా వేయడం కష్టం. బహుశా పేలకపోవచ్చు. అయితే, ఈ ముగ్గురు దిగ్గజాల విశ్లేషణ నుండి నేర్చు కోవాల్సిన పాఠం ఒక్కటే. కేవలం కంపెనీలు తమ విలువను మదించేటప్పుడు అధిక మదింపులను చూసి ఏఐ పరుగులో భాగం కాకుండా, వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను కనుగొనడంపై దృష్టిపెట్టాలి. ఐటీ రంగంలో ఉన్నవారు సాంప్రదాయ పనుల నుండి ఏఐ టూల్స్‌ను ఉపయోగించి క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలకు మారాలి. ప్రతి ఒక్కరూ డెస్క్ జాబ్స్ మాత్రమే కోరుకోకూడదు. సృజనాత్మకత, చేతి నైపుణ్యం అవసరమయ్యే రంగాలకు భవిష్యత్తులో తిరుగు ఉండదు. అటువంటి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్




## కలెక్టరేట్ వద్ద చేనేత కార్మికుల ధర్నాందోళన

నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఈనెల 24న చేనేత కార్మికులు ధర్నాందోళన నిర్వహించారు. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన చేనేతకార్మికులకు నష్ట పరిహారం చెల్లించకపోగా, అధికారులు తమను చులకనగా చూస్తూ అవమానకరమైన రీతిలో మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టరేట్ ముందు బైఠాయించి నిరసనలు తెలిపారు. ఈ ఆందోళనలో పాల్గొన్న బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, చేనేత ఐక్యవేదిక కన్వీనర్ బుధవారపు బాలాజీ మాట్లాడుతూ, ఇటీవల భారీవర్షాల దెబ్బకు మగ్గం గుంటల్లోకి నీళ్లొచ్చి, అనేకమంది ఉపాధి కోల్పోయారని, వారికి కనీస సాయం కూడా ప్రభుత్వం అందించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని నారాయణరెడ్డిపేట, పొదలకూరు, తాటిపర్తి, మడమనూరు, గుమ్మళ్లదిబ్బ తదితర ప్రాంతాల్లో నష్టపోయిన చేనేతకుటుంబాలను ఆదుకునేందుకు సమగ్రమైన వివరాలు సేకరించలేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము చూసినప్పుడు మగ్గం గుంటల్లో నీళ్ళు లేవని, బియ్యం కోసం చేనేతకారులు ఆరాటపడుతూ అలా చెప్తున్నారని కొందరు అధికారులు వెటకారంగా మాట్లాడడం చేనేతకారు లను అవమానించడమేనని వారు మండిపడ్డారు. అనంతరం చేనేతకార్మికసంఘాల నాయకులు, బీజేపీ నేతలు కలిసి ప్రజా సమస్యల వేదిక నిర్వహిస్తున్న అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నాయకులు పముజుల రమేష్, సోమా గోపాల్, రామసుబ్బయ్య, సిహెచ్ సుబ్రహ్మణ్యం, కారంపూడి మోహన్, దోనేపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన బాటలోనే మునిసిపల్ కార్మికులు

దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను అధికారులు కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం దారుణమని మునిసిపల్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల సాధన కోసం నెల్లూరులో గత 21 రోజులుగా నెల్లూరు నగరపాలక సంస్థ ఎదుట ఆందోళన చేస్తున్న మునిసిపల్ కార్మికులు, తమ సమస్యలని పరిశీలించి పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఈనెల 24న హెచ్చరించారు. ఇన్ని రోజులుగా ఆందోళన బాటలో ఉంటున్న కార్మికులకు మద్దతు తెలిపిన సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ, మునిసిపల్ కార్మికులవి న్యాయమైన కోర్కెలని అన్నారు. 60ఏళ్ళు నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, గత సమ్మెకాలపు ఒప్పందాల్లో భాగంగా 14రోజుల సమ్మెకాలపు జీతం ఇవ్వా లని, చనిపోయినవారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి, వారి వారసు లకు ఉద్యోగాలివ్వాలని కార్మికులు కోరుతున్నారని, ప్రభుత్వం వారి సమస్యలు తీర్చాలని కోరారు. నాయకులు కె.పెంచల నరసయ్య, ఎం.సుధాకర్, మాలకొండయ్య, ఎస్‌కె ఖలీల్, సునీల్, అశోక్, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై ఏబీవీపీ నిరసనలు

ప్రైవేట్-కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, సెలవుల్లో కూడా విద్యార్థు లకు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు మానసిక వత్తిడిని కలిగిస్తున్నాయని కావలిలోని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు ధ్వజమెత్తారు. ఈనెల 24న కావలి పట్టణంలో వారు ధర్నాందోళన చేపట్టారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఆదివారాలు, పండుగ రోజులను కూడా వదలకుండా విద్యార్థులను తీవ్రమైన వత్తిడికి గురిచేస్తున్నారని, పలు స్కూల్ బస్సులకు సరైన ఫిట్‌నెస్ లేదని, అగ్నిమాపక సామగ్రి కూడా స్కూళ్లలో ఉండడం లేదని, విద్యార్థులకు సరైన భద్రత కానీ, చదువుకునేందుకు మంచి వాతావరణం కానీ లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తూ.. ఎంఇఓకి వినతిపత్రం అందజేశారు.


# కల్యాణ వైభవం...!

శ్రియ - నిఖిల్



నెల్లూరులోని 'సింహపురి స్కానింగ్ సెంటర్' నిర్వాహకురాలు డాక్టర్ చంద్రసేన - ధనుంజయుల కుమార్తె **డా. శ్రియ - డా. నిఖిల్‌రెడ్డి** (దివంగత భాస్కర్‌రెడ్డి - శ్రీమతి విజేతరెడ్డిల కుమారుడు)ల పరిణయం నవంబర్ 23వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకి 'లాయర్' శుభదీవెనలు.

శ్రావణి - నామ్‌దేవ్



నెల్లూరులోని 'రెయిన్‌బో' స్కూల్ సారధులు మోడేగుంట సుబ్రహ్మణ్యం - శ్రీమతి పద్మ సుబ్రహ్మణ్యంల కుమార్తె **శ్రావణి - నామ్‌దేవ్** (ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ టి.వై. కృష్ణ - శ్రీమతి రోహిణిల కుమారుడు)ల వివాహం నవంబర్ 23వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.

# సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి, సంక్షేమం

## • సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి




సర్వేపల్లి నియోజకవర్గం లోని పలు కంపెనీల సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు వేగ వంతం అవుతున్నాయంటూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ముత్తుకూరు మండలం వల్లూరు పంచాయతీ పరిధిలో ఆయన ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, పామాయిల్ కంపెనీల సహకారంతో గిరిజనుల అభ్యున్నతికి కృషికి అడుగులు పడుతున్నాయన్నారు. బ్రహ్మదేవం వద్ద ఎస్ఇఐఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ఆస్పత్రి నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని, ఆసుపత్రి నిర్మాణానికి 1.80 సెంట్లు కేటాయిస్తున్నామన్నారు. వల్లూరు ఎస్టీ కాలనీలో 27 కుటుంబాలను కార్గిల్ కంపెనీ దత్తత తీసుకోవడం ఆనందదాయకమని, మొదటి విడతలో అక్కడ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడంతో పాటు కాలనీ లెవలింగ్, హెల్త్‌సెంటర్ తదితర పనులను ఆ కంపెనీ చేపట్టిందన్నారు. బుంగే కంపెనీ సెహగల్ ఫౌండేషన్ ద్వారా రైతులకు ఉపయోగపడేలా పలు సేవా కార్యక్రమాలు చేస్తోందని, వల్లూరు, కోడెలమిట్ట, మల్లూరు, ఈపూరుల్లో రైతు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

### 'నెల్లూరు గాంధీ' వెన్నెలకంటి రాఘవయ్య :



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వెన్నెలకంటి రాఘవయ్య గిరిజనుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేసి, నెల్లూరు గాంధీగా పేరొం దారని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. వెన్నెలకంటి రాఘవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన ఇటీవల వెంకటాచలం మండలం గొలగమూడిలోని గురుకులంలో నిర్వహించిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, వెన్నెలకంటి రాఘవయ్య చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిటీషువారి కాలంలో గిరిజనులను బాధించే సీటీయాక్ట్‌ని రద్దు చేయించి, గిరిజనుల జీవితాలకు రాఘవయ్య వెలుగుబాటలు పరిచారన్నారు. విద్యార్ధి రాజకీయాలతో రాజకీయ ప్రవేశం చేసిన తనకు వెన్నెలకంటి వారు సలహాలు, ఆశీస్సులు అందజేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి..
# న్యాయస్థానం కృషి!

## • అధికారులు ప్రజలకు మంచి చేయాలన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి




*ప్రజల ముందుకు న్యాయస్థానం వస్తోంది. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అన్ని చర్యలూ తీసుకునేందుకు సమాయత్తమైంది. హైకోర్టు ఆదేశాలతో జిల్లాలోని న్యాయయంత్రాంగం సమస్యల పరిష్కారానికి కృషిచేయడమే కాక, అవసరమైతే హైకోర్టే నేరుగా రంగంలోకి దిగి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధం కావడం విశేషం. దీంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.*

ఇటీవల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ జిల్లాలోని ఉన్నతాధికారులతో సమావేశమై, సమాజం - న్యాయవ్యవస్థతో అనుబంధం కలిగిన ప్రభుత్వ శాఖలన్నీ ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక భూమిక పోషించాలని, చెప్పారు. అధికారులందరూ పౌరులకు మంచి చేయాలనే దృక్పథంతో పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ప్రధానంగా రోడ్డు ప్రమా దాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, నిరుపేద ఖైదీలకు న్యాయసహాయం, లోక్‌అదాలత్ కేసులు, బాధితులకు నష్టపరిహారం మొదలైన అంశా లపై చర్చించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వాణి, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, నెల్లూరు, తిరుపతి ఎస్పీలు డాక్టర్ అజిత వేజండ్ల, సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంక టేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ సౌజన్య, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు

### ప్రతి సమస్యను హైకోర్టు పరిశీలిస్తుంది

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, హైకోర్టు వారి ఆదేశాలతో ప్రతి మూడు నెలలకోసారి ప్రజాసమస్యలకు పరి ష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వశాఖల సమన్వయ కమిటీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. న్యాయస్థానాల దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన పలు సమస్యలపై శాఖల వారీగా అధికారులతో చర్చించి పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి సమస్యను కూడా హైకోర్టు నిశితంగా పరిశీ లిస్తుందని, కొన్ని సందర్భాల్లో హైకోర్టు వారే సమస్యను సుమోటోగా స్వీకరించి విచారిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పత్రికల్లో వచ్చిన కొన్ని సంఘటనలను హైకోర్టు సుమోటోగా స్వీకరించి చర్యలకు ఆదేశించినట్లు తెలిపారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో చార్జిషీట్లను సకాలంలో ఫైల్ చేయాలని, లేకుంటే నోటీసులు జారీచేస్తామని ఆయనన్నారు. అధికారులందరూ పౌరు లకు మంచి చేయాలనే దృక్పథంతో పనిచేయాలని సూచించారు. కేసుల సత్వర పరిష్కారం లక్ష్యంగా డిసెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తు న్నామని, ప్రజలు దానిని ఉపయోగించుకుని సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ సందర్భంగా తెలిపారు.

# పర్యాటక ప్రగతి

## 20 సూత్రాల అమలు కమిటీ చైర్మెన్ లంకా దినకర్



జిల్లాలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేస్తామని, అందుకు శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయా లని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మెన్ లంకా దినకర్ చెప్పారు. ఈనెల 25న ఆయన నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన అధికారుల సమావేశంలో మాట్లాడారు. ఆధునిక హంగులతో జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దడానికి అవకాశాలున్నాయని, 77 లక్షల రూపాయలతో మైపాడు బీచ్‌ని అభివృద్ధి చేసేందుకు చేయాల్సిన పలు పనులకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని చెప్పారు. పల్లిపాడు వద్ద పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమానికి 26.04 కోట్లతో డిపిఆర్ తయారు చేసి నట్లు ఆయన తెలిపారు.

## విజయవాడ సాంస్కృతికోత్సవాలలో
# మన నెల్లూరీయులకు సత్కారం



ఇటీవల విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా కేంద్రంలో రెండురోజుల పాటు జరిగిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో నెల్లూరు కవులు, కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండురోజుల సభలలో తన ప్రసంగం ద్వారా సభికులను ఆకట్టుకున్న ప్రముఖ కవి చిన్ని నారాయణరావును కలెక్టర్ లక్ష్మీశ, మాజీమంత్రివర్యులు అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, నాటక అకాడమీ ఛైర్మెన్ గుమ్మడి గోపాల కృష్ణలు అభినందించి సత్కరించారు. గజల్ శ్రీనివాస్, ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ఆకాశవాణి మాజీ సంచాలకులు డా॥ ఇంద్ల రామసుబ్బారెడ్డితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక మంది ప్రముఖులు పాల్గొన్న ఈ సభల్లో వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జె.వసుంధరమ్మను కూడా సన్మానించి ఆమె సమాజానికి అందిస్తున్న సేవలను అభినం దించారు.



## రాజరాజేశ్వరమ్మ దేవాలయంలో
# కాత్యాయని వ్రతం
• పాల్గొన్న హీరో ప్రభాస్ పెదమ్మ



ప్రముఖ సినీ హీరో ప్రభాస్ పెదమ్మ, దివంగత హీరో కృష్ణం రాజు సతీమణి ఉప్పలపాటి శ్యామలాదేవి ఈనెల 25న నెల్లూరు, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరమ్మ దేవాలయంలో జరిగిన కాత్యాయనీ వ్రతంలో పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు.

# డాక్టర్ శ్రీహరిరావుకు సన్మానం



జిల్లా ప్రజలకు మెరుగైన మానసిక వైద్యసేవలను అందించేందుకు ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ సుబ్బరాం సన్నపరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన 'హ్యాపీ యు క్లినిక్'ని ఇటీవల ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ను డాక్టర్ సుబ్బరాం బృందం సన్మానించారు. అనంతరం, డాక్టర్ శ్రీహరిరావు మాట్లాడుతూ, మానసిక వత్తిడిలను అధిగమించేందుకు ఇలాంటి మానసిక చికిత్సాలయాలు అవసరమన్నారు. అలాంటి క్లినిక్‌ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ సుబ్బరాంను, వారి సిబ్బందిని ఆయన అభినందించారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, ఐఎంఏ నాయకుడు డాక్టర్ అశోక్, నేతాజీ విద్యాసంస్థల అధినేత ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# శ్రీసిటీకి ఇద్దరు ప్రత్యేక అధికారులు!

పరిశ్రమలకి మరింత అనుకూల వాతావరణం కల్పిస్తూ, పారిశ్రామిక సేవలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం శ్రీసిటీలో ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించింది. వారి సేవలతో పరిశ్రమలకి సంబంధించిన పలు అనుమతులు, ప్రోత్సాహకాలు త్వరితగతిన అందుతాయని భావిస్తున్నారు. ఈనెల 26న తిరుపతిలోని జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి వి. జయంత్‌కుమార్‌ను శ్రీసిటీ ఫెసిలిటేషన్ ఆఫీసర్‌గా నియమించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం శ్రీసిటీలో ఆయన అందుబాటులో ఉంటారు. పరిశ్రమల శాఖ, శ్రీసిటీ యాజమాన్యం, కంపెనీల మధ్య ప్రధాన అనుసంధాన అధికారిగా వ్యవహరిస్తారు. పరిశ్రమలకు అవసరమైన సేవలు వేగంగా, సమర్థవంతంగా అందేలా చేస్తారు. అలాగే ఏపీఐఐసి ప్రాజెక్టు ఇంజనీర్ (సివిల్) సుగుణను శ్రీసిటీ ఐలా అధికారిగా నియమించారు. భవన అనుమతుల ఆన్‌లైన్ ప్రాసెసింగ్, ప్రాపర్టీ టాక్స్ నిర్వహణ, వివిధ శాఖలతో సమన్వయం ద్వారా ఆన్‌లైన్ సేవల పరిష్కారం తదితర విధులను ఆమె నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సమర్థ నాయకత్వాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కొనియాడారు. శ్రీసిటీలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'వన్-స్టాప్ అడ్మినిస్ట్రేషన్' అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక అధికారుల నియామకం వల్ల అనుమతుల మంజూరు ప్రక్రియ వేగవంతమవుతుందని, విభాగాల మధ్య సమన్వయం మెరుగవుతుందని, పరిశ్రమలకు సహకారం అందుతుందని తెలిపారు.

# జూడోలో సత్తాచాటిన ఏఆర్ కానిస్టేబుల్

**అభినందించిన జిల్లా ఎస్పీ**



నెల్లూరులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె. చరణ్‌తేజ్ జూడోలో సత్తా చాటాడు. గత నెలలో జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఆలిండియా పోలీస్ జూడో క్లస్టర్ గేమ్స్-2025లో పెన్‌కాక్ సిలాట్ విభాగంలో ఆయన ప్రతిభతో రాణించి అగ్రస్థానంలో నిలిచాడు. ఈనెల 26న నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆ కానిస్టేబుల్‌ను అభినందించారు. జాతీయస్థాయిలో జరిగిన పోటీల్లో ఆయన బంగారుపతకం సాధించడం అభినందనీయమన్నారు.

## టూకీగా...



### బుచ్చిరెడ్డిపాలెం రెయిన్‌బో విద్యార్థుల ప్రతిభ

బుచ్చిరెడ్డిపాలెంలోని రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు కరాటేలో సత్తా చూపారు. నంద్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచి ఏడుగురు విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. విజేతలైన ఆ విద్యార్థులను ఈనెల26న ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఎలియారాజ్, పీఈటీ బీవీ రమణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

### రాపూరులో రాజ్యాంగ దినోత్సవం

రాపూరులో ఈనెల 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత భారత రాజ్యాంగకర్త డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, రాజ్యాంగం గొప్పతనాన్ని గ్రంథాలయ అధికారి అంజయ్య, సహాయకుడు వెంకటేశ్వర్లు విద్యార్థులకు వివరించారు.

### బ్రహ్మదేవంలో 'రైతన్నా మీకోసం' కరపత్రాలు

ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం గ్రామంలో ఈనెల 26న టీడీపీ నాయకులు రైతులకు 'రైతన్నా మీకోసం' కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు ఆలూరి వెంకట విష్ణువర్ధన్‌రావు, బొబ్బేపల్లి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

### పొదకూరులో ఆరోగ్యశాఖ వైద్యశిబిరం

పొదలకూరు నరసారెడ్డి కాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలో ఆరోగ్యశాఖ అధికారులు ఈనెల 26న వైద్యశిబిరం నిర్వహించి వృద్ధులకు ఆరోగ్యపరీక్షలు చేసి తగు సలహాలిచ్చారు. డాక్టర్ కిరణ్ రిషిత, ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, ఎంహెచ్‌పీ సుమాంజలి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముత్తుకూరులో చేపల రైతులకు శిక్షణ

ముత్తుకూరు మత్స్యకళాశాల ఆడిటోరియంలో ఈనెల 26న జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాణ్యమైన చేపపిల్లల ఉత్పత్తి, చేపల పెంపకం అనే అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. నాబార్డ్ జిల్లా అధికారి బాబు, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.ధనపాల్, డాక్టర్ ఎన్ మాధవన్, ట్రైనింగ్ ఆర్గనైజర్ డాక్టర్ పి. ఆనందప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నారాయణమ్మపేటలో ఎన్ఎస్ఎస్ వైద్యశిబిరం

సీతారామపురం మండల పరిధిలోని నారాయణమ్మపేటలో ఈనెల26న విఎస్‌యు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ ఉమాశంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేష్, వైద్యాధికారి నాయక్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### సంగం వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన

మండల కేంద్రమైన సంగం జాతీయ రహదారి వద్ద ఈనెల26న ఎస్ఐ రాజేష్ వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కలిగించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ని తప్పనిసరిగా ధరించాలని, తద్వారా ప్రమాదాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. వాహనదారులు నాణ్యమైన హెల్మెట్‌ని కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

### నార్తురాజుపాలెంలో పేకాటరాయుళ్ల అరెస్ట్


కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెంలో పేకాటాడుతున్న అయిదుగురు జూదరులను ఈనెల 26న పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 17వేల రూపాయలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కోటిరెడ్డి ఆధ్వర్యంలో వారిపై కేసు నమోదు చేశారు.

### కృష్ణారెడ్డిపల్లి ప్రజలకు వైద్య సేవలు

సైదాపురం మండలంలో మారుమూలన ఉన్న కృష్ణారెడ్డిపల్లి గ్రామంలోని ప్రజలకు ఈనెల 26న 104 సిబ్బంది వైద్య సేవలందించారు. అవసరమైనవారికి మందులిచ్చారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు గ్రామస్తులకు వివరించారు.

# స్పీకర్ పదవికి వన్నె తెచ్చిన.. రేబాల దశరథరామిరెడ్డి!

ఆగర్భశ్రీమంతుడిగా జన్మించిన రేబాల దశరథరామిరెడ్డి గొప్ప దేశభక్తుడు. గాంధీజీ పిలుపు మేరకు జాతీయోద్యమంలోకి అడుగిడి పలు ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అన్నదాతలంటే ఎనలేని అభిమానం చూపే ఆయన, సహకార బ్యాంకు అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేసి రైతు పక్షపాతిగా పేరు పొందారు. మూడేళ్లకు పైగా స్పీకర్‌గా పనిచేసి నెల్లూరుజిల్లాకు శాశ్వత కీర్తిని తెచ్చిపెట్టారు. ఓడినా గెలిచినా రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యత ఇచ్చారు. అనేక కీలక పదవులు నిర్వహించిన ఆయన.. జిల్లాకు అందించిన సేవలు చిరస్మరణీయం.



**కీర్తిమూర్తులు**

## జననం, విద్యాభ్యాసం..

ఆర్‌డిఆర్‌గా అందరికీ సుపరిచితులైన రేబాల దశరథరామిరెడ్డి స్వగ్రామం నెల్లూరు జిల్లా అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామం. వీరు 1907 నవంబర్ 30న జన్మించారు. వీరి తల్లిదండ్రులు లక్ష్మమ్మ, హరిశ్చంద్రారెడ్డి. వీరిది జమీందారీ కుటుంబం. వీరి ప్రాథమిక విద్య మద్రాసులో సాగింది. మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి బి.ఏ, మదన్‌మోహన్ మాలవ్య స్థాపించిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం(వారణాసి) నుంచి ఎల్.ఎల్.బి డిగ్రీ చదివి న్యాయవాద వృత్తి చేపట్టారు. 1930 తొలినాళ్లలో జాతీయ కాంగ్రెస్ ఆర్గనైజేషన్‌లో చేరారు.

## స్వాతంత్ర్యోద్యమంలో..

జాతిపిత మహాత్మా గాంధీ పిలుపుమేరకు జాతీయోద్యమంలోకి అడుగుపెట్టారు. 1940లో అల్లూరుకు సమీపంలోని గోగులపల్లిలో చేపట్టిన చారిత్రక ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి జైలు శిక్ష అనుభవించారు. వ్యష్టి సత్యాగ్రహం చేపట్టి 1941 మార్చి31న 2నెలలు జైలు శిక్ష, రూ.500 జరిమానా ఎదుర్కొన్నారు. వేలూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించాక 1947- 51 కాలంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కీలకమైన కేసులను తన ప్రతిభాపాటవాలతో వాదించారు. హైదరాబాద్ వెళ్లి హైకోర్టు న్యాయవాదిగా గొప్ప పేరు పొందారు.

## రాజకీయాలంటే మక్కువ ఎక్కువ...

రాజకీయాలంటే వీరికి ఎనలేని మక్కువ. కాంగ్రెస్ పార్టీ అభిమాని. 1960లో కావలి నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. 1962లో కోవూరు నియోజకవర్గం నుంచి విజయం సాధించి 1967 వరకు శాసనసభ్యుడుగా ఉన్నారు. 1967లో కావలి పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1972లో అల్లూరు నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎంపికయ్యారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 1975 జనవరి 28న రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరుజిల్లా నుంచి సభాపతి అయిన తొలి వ్యక్తిగా ఖ్యాతిచెందారు. 1978 మార్చి 14 వరకు స్పీకర్‌గా పనిచేశారు. స్పీకర్‌గా తను పనిచేసిన 3 సంవత్సరాల 45 రోజులలో స్పీకర్ పదవికి వన్నె తెచ్చారు. అధికారపార్టీకే కాక అన్ని పార్టీలవారికి శాసనసభలో తగు ప్రాధాన్యత కల్పిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించారు.

## రైతాంగానికి అపార సేవలు...

దశరథరామిరెడ్డి అనేక పదవులను నిర్వహించారు. 24ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ బాధ్యతల్లో జిల్లా రైతాంగానికి ఆయన చేసిన సేవలు అపారమైనవి. ఆంధ్ర యూనివర్సిటీ సెనేట్ మెంబర్‌గా మూడేళ్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ అధ్యక్షులుగా, మద్రాసు స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర రోడ్డు రవాణా అథారిటీ సభ్యులుగా ఐదేళ్లు, 1974 జనవరి 1 నుంచి స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే వరకు కోస్టల్ ఆంధ్ర ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులుగా పనిచేశారు. 2005 జూన్ 9న ఆయన తుదిశ్వాస విడిచారు.

(నవంబర్ 30, రేబాల దశరథరామిరెడ్డి జయంతి సందర్భంగా...)



చల్లా చంద్రశేఖర్‌రెడ్డి
సెల్. 94409 28666

# రాష్ట్రంలో మరో మూడు జిల్లాలు

## ➢ మారనున్న ఆంధ్ర ముఖచిత్రం

అనేక తర్జనభర్జనలు, చర్చలు, సమావేశాల తర్వాత ఎట్టకేలకు జిల్లాల పునర్ విభజనపై కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. కొత్తగా మూడు జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలంటూ మంత్రివర్గ ఉపసంఘం ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సూచన ప్రాయంగా ఆమోదించారు. ఇక ఈనెల 28న నిర్వహించే కేబినెట్ సమావేశంలో కొత్త జిల్లాలపై తీర్మానం చేసి, అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. తర్వాత ప్రజల నుంచి ఏదైనా తీవ్ర అభ్యంతరాలు ఎదురైతే మరోసారి ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించే అవకాశం ఉంది. అలా కాకుంటే అన్నీ అనుకున్నట్లు జరిగితే 2026 జనవరి 1వ తేదీ నుంచి కొత్త జిల్లాలు అమల్లోకి రానున్నాయి.

### 29 జిల్లాలు
### 82 రెవెన్యూ డివిజన్లు..

ప్రస్తుతం విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాలు, 77 రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉమ్మడి జిల్లాలను పునర్‌విభజన చేసింది. అయితే, ఆ సమయంలో కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదురైనా ప్రజాభిప్రాయాన్ని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా జిల్లాలను విభజించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లాల విభజన హేతుబద్ధంగా చేపట్టాలని ఆయా ప్రాంత ప్రజలు చేపట్టిన ఆందోళనలను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో 2024 ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లాలో ప్రచారానికి వెళ్లిన చంద్రబాబు మార్కాపురాన్ని జిల్లాకేంద్రంగా చేస్తామని ప్రకటించారు. అలాగే ఒకప్పుడు ఆసియాలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా గుర్తింపుపొందిన మదనపల్లెను కూడా ప్రత్యేక జిల్లా చేయాలని అక్కడి ప్రజలు దశాబ్దాలుగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాల పునర్ విభజన కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని చంద్రబాబు ఏర్పాటు చేశారు. ఈ ఉపసంఘంలోని సభ్యులు పలుమార్లు సమావేశమై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన వినతుల్లో సహేతుకమైన వాటిని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లారు. వాటిలో ప్రధానంగా మదనపల్లె, మార్కాపురం, పోలవరం జిల్లాలకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరు నియోజకవర్గాన్ని కొత్తగా ఏర్పడే మదనపల్లె జిల్లాలో కలపనున్నారు. తద్వారా మదనపల్లె, పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలతో కొత్తగా మదనపల్లె జిల్లాకు రూపకల్పన చేయనున్నారు. ఇక ఎర్రగొండపాళ్యం, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పడనుంది. అలాగే, రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లను కలిపి పోలవరం పేరిట కొత్త జిల్లాకు శ్రీకారం చుట్టనున్నారు. ఫలితంగా రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 29కి చేరనుంది. అలాగే నక్కపల్లి, అద్దంకి, మడకసిర, పీలేరు, బనగానపల్లె కొత్త రెవెన్యూ డివిజన్లు కానున్నాయి. ఇక ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని కలవాయి, రాపూరు, సైదాపురం మండలాలను గూడురు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తున్నారు. తద్వారా ఇవన్నీ తిరుపతి జిల్లాలో అధికారికంగా చేరనున్నాయి. అలాగే బాపట్ల జిల్లాలోని అద్దంకి, నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గాలు తిరిగి ప్రకాశం జిల్లాలో కలవనున్నాయి. ఇక రాజంపేట నియోజకవర్గంలోని మండలాలన్నీ అన్నమయ్య జిల్లా పరిధిలోకి తీసుకొస్తుండడంతో కడప జిల్లాలోని అసెంబ్లీ నియోజక వర్గాల సంఖ్య 8 నుంచి 7కి తగ్గనుంది. అయితే, గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలపడం, నగరి నియోజకవర్గాన్ని పూర్తిగా తిరుపతి జిల్లాలోకి తీసుకురావడం వంటి ప్రతిపాదనలను మాత్రం మంత్రివర్గ ఉపసంఘం విస్మరించడం చర్చనీయాంశంగా మారింది.

## గూడూరు జారిపోయింది.. కందుకూరు వెళ్ళిపోయింది!

### ➢ రాపూరు, కలువాయి, సైదాపురం ఇక నెల్లూరువి కావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన జిల్లాల పునర్విభజన ప్రక్రియలో నెల్లూరు జిల్లాకి తీరని అన్యాయం జరిగింది. మొత్తం 10 అసెంబ్లీ నియోజకవర్గాలు వున్న జిల్లా గత ప్రభుత్వ నిర్వాకంతో 7 నియోజకవర్గాలకే పరిమితమైన సంగతి తెలిసిందే. ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆ 7 నియోజకవర్గాలలో నుండి కూడా మరో నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపేసి జిల్లాకి 6 అసెంబ్లీ నియోజకవర్గాలని మాత్రమే మిగిల్చింది. గతంలో ప్రకాశం నుండి నెల్లూరుజిల్లాలో కలిసిన కందుకూరుని తిరిగి ప్రకాశంలోనే కలిపేసింది.

పేరుకి వేంకటగిరి నియోజకవర్గమైనా ప్రభుత్వ లావాదేవీల పరంగా ఆత్మకూరు, నెల్లూరు రెవిన్యూ డివిజన్లలో భాగంగా ఉంటూ నెల్లూరుజిల్లాతో సంబంధం కలిగి వుండిన రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలని కూడా గూడూరు డివిజన్‌లో కలిపేసి తిరుపతి జిల్లాకి పంపించేశారు. తాజాగా జరిగిన జిల్లాల పునర్విభజన కసరత్తులో గూడూరుని తిరిగి నెల్లూరులో కలుపుతారన్న గూడూరు వాసుల ఆశలు అడియాసలే అయ్యాయి. కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన ప్రక్రియ మొదలు పెట్టినప్పటి నుండి గూడూరు మళ్ళీ నెల్లూరులో కలవబోతోందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. తీరా తుదిదశకి వచ్చే సమయానికి గూడూరు చేజారిపోయింది. కందుకూరు తిరిగి వెనక్కి వెళ్ళిపోయింది.

### మాట తప్పిన పెదబాబు, చినబాబు!

**ఎన్నికల ముందు అనేక పర్యాయాలు జరిగిన పర్యటనలలో, సభలలో చంద్రబాబు, లోకేష్‌బాబులకి తమని మళ్ళీ నెల్లూరుజిల్లాలో కలపమని గూడూరు వాసుల నుండి వినతులు వెల్లువెత్తాయి. తమ పార్టీ అధికారంలోకి వస్తే తప్పనిసరిగా గూడూరు వాసుల మాట తీరుస్తామని ఇద్దరూ హామీ ఇచ్చారు. ఇప్పుడు, తాజాగా జిల్లాల పునర్విభజన జరిగిన క్రమంలో ఇచ్చిన మాటని కొండెక్కించడమే కాకుండా మొత్తం అన్నీ నియోజకవర్గాలలో తమకి ఘన విజయం కట్టబెట్టిన నెల్లూరుకి 6 నియోజకవర్గాలనే మిగిల్చి జిల్లాని మరగుజ్జుని చేసేశారు.**




శ్రద్ధాంజలి

ప్రజాసేవలో ధన్యం మీ జీవితం
ప్రజల గుండెల్లో మీ స్థానం శాశ్వతం

కీ॥ శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు

30వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...

కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు

తేది: 1-12-2025 సోమవారం ఉ॥ 10.30 గం॥లకు నెల్లూరు, పొగతోటలోని M1 సినిమాస్(S2 సినిమాస్)లో
మహనీయులు కీ॥శే॥ మాగుంట సుబ్బరామరెడ్డి గారికి స్మృత్యంజలి ఘటిస్తారు.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com